## అయినంపూడి శ్రీలక్ష్మి

కవిత్వం



# Monologue of a బ్రాండెడ్ హార్ట్

**శ్రీలక్ష్మి** నిజామాబాద్ జిల్లా బోధన్‌లో వ్యవసాయ కుటుంబంలో పుట్టారు. తరతరాలుగా ఆడపిల్లలే లేని అయినంపూడి వారింట 7వ తరంలో పుట్టిన ఆడపిల్ల. తాత, నానమ్మల దగ్గరే పెరిగారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత శ్యామ్‌సుందరరావు గారి వారసత్వంగా కూతురిగా అందిపుచ్చుకున్నది రచనా వ్యాసంగమే.

ఒకటవ తరగతి నుండి MA వరకు చదువంతా ప్రభుత్వ పాఠశాలలు – కళాశాలల్లోనే సాగింది. B.Ed. లో కాలేజ్ టాపర్‌గా డిస్టింక్షన్‌లో పాసైనా, టీచింగ్ ఫీల్డ్ వైపు పోకుండా ఆకాశవాణి మీద ఆరాధనతో అనౌన్సర్‌గా చేరారు.

17వ యేటనే "పొద్దు పత్రిక"లో కాలమిస్ట్‌గా నిజామాబాద్ జిల్లా కళాకారుల వేదికను నిర్వహించారు. వ్యాఖ్యాత్రిగా, ఫిల్మ్‌మేకర్‌గా, ఈవెంట్ మేనేజర్‌గా, కవయిత్రిగా, అనువాదకురాలిగా విభిన్న రంగాలలో అభినివేశం ఉన్నప్పటికీ తన అసలుసిసలు చిరునామా 'కవిత్వమే' అంటారు

రంజని కుందుర్తి, వంగూరి ఫౌండేషన్, హంసిని, 'కఫిసో' జాతీయ అవార్డ్ (లైఫ్ @ చార్మినార్ డాక్యూపోయం) లను అందుకోవడమే కాక రెండుసార్లు నంది జ్యూరీ మెంబర్‌గా అటు TV, ఇటు సినిమా రంగాలకు పనిచేశారు.

అలలవాన (2002), దృక్కోణం (2004), కనకాంబరాలు (2008), లైఫ్ @ చార్మినార్ (2011) ఇప్పటివరకు వెలువడ్డ కవితా సంకలనాలు. వెన్నెల దుఃఖం కవితాసంపుటి, లైఫ్ @ చార్మినార్ (హిందీ, ఆంగ్ల ముద్రణలు) డాక్యూ పోయంలు ప్రచురణలో ఉన్నాయి.

ప్రస్తుతం ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో సీనియర్ గ్రేడ్ అనౌన్సర్‌గా పనిచేస్తున్నారు... భర్త నాగేశ్వరరావుగారు Syndicate Bank లో అసిస్టెంట్ మేనేజర్, పెద్దకూతురు సాయినవ్యత, అల్లుడు బొద్దులూరి యశస్వీలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్. చిన్నకూతురు సాయి హర్షిత అమెరికాలో M.S. చేస్తున్నారు.

శ్రీ హరిచంద్ర క్రియేషన్స్

# Monologue of a
# బ్రాండెడ్ హార్స్

## అయినంపూడి శ్రీలక్ష్మి



సరోజినీ శ్యాంసుందర్ వృద్ధాశ్రమ సేవాసంఘం
హైదరాబాద్
ప్రచురణ 5

**Monologue of a Wounded Heart** Long Poem
**Inampudi Shreelaxmi**
9989928562
e-mail : shreelaxmi.inampudi@gmail.com
website : www.inampudishreelaxmi.com
© Poetess

**First Edition :** 2013 October

**Layout & Printed at :**
Om Sai Graphics
Narayanaguda, Hyd.

**Publisher :**
Sarojini Shyamsundar
Vriddharshrama Seva Sangham,
Hyderabad.

**for Copies : B. Nageswara Rao**
Flat No : 103, Durga Apartments,
Durganagar Colony, Somajiguda, Hyd.

**Copies availabe at :**
Vishalandhra Book House
Prajashakthi Book House
Navodaya Book House, Hyd.

₹ **75/-**

Front Cover : Painting *"Emotions"* by **Hari Krishna Mamidi**

Back Cover : Photo of a Cancer Cell Captured Through a powerful microscope

Cover Page Design : **Chandravathi**

e-book-available at www.kinige.com

## అంకితం

గుప్పెడంత గుండెలో
ఆకాశమంత దుఃఖాన్ని నింపుకుని
ఏ అవగాహనా లేక
లోలోపలే కృశ్శిపోతూ కృంగిపోతూ
అర్థాంతరంగా ఆకాశానికే ఎగిసిపోతున్న
ఇంటి దీపాలకు ఇల్లాళ్ళకు –

ధైర్యంతో ఆత్మస్థైర్యంతో
బ్రెస్ట్ క్యాన్సర్‌ని
ఎదురొడ్డి పోరాడి గెలిచిన
మహిళలకు మానవిలకు –

## ధన్యవాదాలు

మా కుటుంబానికే కాకుండా లక్షలాది మందికి అండగా నిలుస్తున్న డా॥ రేఖ–మురళీధర్‌రావు దంపతులు, డా॥ ములుకుట్ల రాఘవదత్, డా॥ మద్దినేని జగదీష్–పద్మ దంపతులు, డా॥ సింహాద్రి చంద్రశేఖర్–డా॥ నిర్మల దంపతులు, డా॥ పాపారావు–డా॥ రమ దంపతులు, డా॥ గీతానాగశ్రీ–డా॥ అమరేష్ దంపతులు, డా॥ దశరధ రామిరెడ్డిగారు, డా॥ జగన్‌మోహన్‌రెడ్డి, డా॥ పర్వతనేని నాగేంద్ర, డా॥ నాగేశ్వర్‌రెడ్డి, డా॥ పి. రఘురాం, డా॥ అమ్మడు (W/o డా॥ నిరంజన్ రెడ్డి), డా॥ కోయకిషోర్, డా॥ ఉషా, డా॥ శశికళ, డా॥ కాసు ప్రసాదరెడ్డి (మాక్సివిజన్), డా॥ మూర్తి (వాసన్ ఐ కేర్), డా॥ జలపతిరావు, డా॥ రాంమోహన్‌రావు, డా॥ హరిప్రసాద్, డా॥ కె. నందకుమార్, డా॥ మధుసూదన్, డా॥ జైనీ నెహ్రూ, డా॥ భారతిరాణి, డా॥ సుమలత నేతాజి, డా॥ వినోద్‌కుమార్ గుప్తా, డా॥ సురేష్‌కుమార్, డా॥ రమేష్ గూడపాటి, డా॥ ప్రవీణ్, డా॥ అంజనేయులు, CGHS Drs. డా॥ మోహన్‌రావు, డా॥ రాంబాబు, డా॥ అనురాధ, డా॥ జె. మహేష్ ఇంకా.... ఎందరో మహానుభావులు....

"వైద్యో నారాయణో హరి".

**కన్పించని ఆ దేవుళ్ళకంటే నడిచే దేవుళ్ళుగా అనుక్షణం మా ఇంటిని కాపాడుతున్న డాక్టర్లందరికి పాదాభివందనాలు**

## ఆత్మీయ ఆశీస్సులు....



Life is a continuous challenge & an unending struggle. We are not made rich by what is in our pocket. But we are rich by what is in our heart....

ఈ మాటను నేను ఎక్కువగా నమ్ముతాను... ఆచరిస్తాను కూడా... శ్రీలక్ష్మి ఈ పొయెట్రీ బుక్ తెచ్చినప్పుడు, దాన్ని పూర్తిగా చదివినప్పుడు నాకు మరలా గుర్తొచ్చిన కొటేషన్ కూడా అదే –

ఎయిడ్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నేను కొన్ని వేల మందిని చూశాను... జీవిత చరమాంకంలో వున్న వారిని కలిశాను... డీప్ షాక్‌కి గురై నిరాశావాదులుగా మారిన వారిని కౌన్సిలింగ్ చేశాం – నాకనిపించేది ఒక్కటే– సజావుగా సాగేది ఎప్పుడూ జీవితం కాదు. అనుకోనివి జరగటమే జీవితం. మన స్థైర్యాన్ని పరిశీలించటానికి, పరీక్షించటానికి కొన్ని కొన్ని సంఘటనలు అలా వస్తూ పోతుంటాయి.... అప్పుడే మన అసలు వ్యక్తిత్వం బయటపడ్తుంది– అయితే వ్యాధి గ్రస్తులకి కావల్సింది మందులు కాదు – ఆత్మీయత, ఆలంబన – ఆసరా. If you want to give a real gift to anyone give him your time & attention. A loving heart doesn't expect anything more...

క్యాన్సర్.... ప్రపంచాన్ని వణికిస్తున్న పదంగా నేను భావించటం లేదు. ఎందుకంటే ఎయిడ్స్‌ని గుర్తించిన తొలి దశలో 'అమ్మో' అన్నారు. దాని గురించి అవగాహన కల్గిన కొద్దీ అపోహలన్నీ తొలిగిపోయి సహానుభూతిని ప్రదర్శిస్తున్నారు ప్రజలు... ఇదీ అంతే...


నాకు తెల్సి లక్షల మంది క్యాన్సర్ బారినపడుతున్నా మరణాల సంఖ్యని మనం నియంత్రించగల్గుతున్నాం... పెరిగిన శాస్త్రసాంకేతికతల పుణ్యమా అని ఒకప్పటితో పోల్చుకుంటే ఇప్పుడు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి...

మనం అర్థం చేసుకోవాల్సింది ఒక్కటే– ఆచరించాల్సిందీ ఒక్కటే... చక్కటి ఆహారపు, ఆరోగ్యకరమైన అలవాట్లను పెంచుకుంటే చాలు... దేనికీ భయపడకుండా భరోసాగా వుండొచ్చు... ఏదొచ్చినా దాని గురించి అపోహలతో బ్రతకకుండా పూర్తి అవగాహన పెంచుకుంటే 'ఓస్ ఇంతేనా' అన్పిస్తుంది. A stone is broken by the last stroke. It doesn't mean that first stroke was useless. Success is a result of continuous efforts Try and try untill you win....

ఇక ఈ "మోనోలాగ్ ఆఫ్ ఏ వూండెడ్ హార్ట్" పుస్తకం విషయాని కొద్దాం– 'ఒక సిరాచుక్క' లక్ష మెదళ్ళకు కదలిక తెస్తుందని బలంగా నమ్మే వ్యక్తిని నేను... లుక్ కల్చర్ కంటే, బుక్ కల్చర్‌ని అమితంగా అభిమానిస్తాను కూడా. నా దగ్గర ఓ మోస్తర్ బుక్స్ కలక్షన్ వుండటం వల్ల అప్పుడపుడు చదువుతూవుంటాను. సహజంగా నేను లలిత కళల్ని ఇష్టపడ్తాను – సంగీత సాహిత్యాలు మనసును ఎప్పటికప్పుడు ఆహ్లాదంగా వుంచుతాయని నేను భావిస్తాను... ఏ కళా రూపాన్ని తీసుకున్నా కూడా సబ్జెక్ట్, ప్రెజెంట్ చేసే విధానాన్ని బాగా గమనిస్తూ కల్చరల్ ప్రోగ్రామ్స్ చేయాల్సి వచ్చినప్పుడు కూడా స్పెసిఫిక్‌గా ఆర్టిస్టులకి అదే చెప్తుంటాను.

శ్రీలక్ష్మి తీసిన "లైఫ్@ చార్మినార్" డాక్యుపోయెం ని మా కుటుంబమంతా చూశాము. మంచి ప్రయోగం అన్పించింది. నేను గమనించినంత వరకు శ్రీలక్ష్మి ఎప్పటికప్పుడు సాహిత్య ప్రయోగాలు చేయటాన్ని ఇష్టపడ్తుంది. తనని తాను ఎప్పుడూ అప్‌డేట్ చేసుకుంటుంది. గత 2 దశాబ్దాలుగా తన సాహితీ ప్రస్థానాన్ని మా కుటుంబమంతా గమనిస్తున్నాం– నా శ్రీమతి శోభ ఆత్మీయంగా చూసుకునే మా ఇంటి ఆడపడుచు తాను. రాష్ట్ర స్థాయి రచయిత్రులు/కవయిత్రుల సమక్షంలో మా 'ఎయిడ్స్ అవగాహన సదస్సులో' ఈ పుస్తకం ఆవిష్కరించాలనుకోవడం ఆనందదాయకం. శ్రీలక్ష్మికి మరింత మంచి సాహితీ భవిష్యత్తును కాంక్షిస్తున్నాం. ఈ కవిత క్యాన్సర్ వ్యాధి గ్రస్తుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచాలని, వారికి కొంత ఒదార్పుగా నిలవాలని ఆశిస్తున్నాం– హరికృష్ణ చెప్పినట్లు ఈ కవిత్వం 'థెరపీగా' ఉపయోగపడాలని కోరుకుంటున్నాము.

*ఆశీరభినందనలతో.....*



**సి. శోభ – పార్థసారథి** IAS

*ప్రాజెక్ట్ డైరెక్టర్, ఆం.ప్ర. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ*



# పొయెట్రీ ఓ ఫీలింగ్.. ఓ కెథార్సిస్.. ఓ థెరపీ

అక్షరాలు పచ్చనాకులు.
పదాలు రెమ్మలు...
వాక్యాలు కొమ్మలు
వీటన్నింటినీ పొందికగా అమర్చుకొని
నిండుగా కనిపించే వృక్షమే కవిత్వం!

ఈ కవితావృక్షానికి బాహ్యంగా దృశ్యమానమయ్యే అంశాలన్నిటికీ ప్రాతిపదిక నేలలోకి దిగబడిన దాని వేళ్ళలోనే ఉంది. ఆ వేళ్ళే భావాలు అనుభవాలు... అనుభూతులు! అంటే కవితా వృక్షానికి తొలి బీజం- భావం! తొలి ఆధారం - అనుభవం! తొలి ఆలంబన - అనుభూతి !!! ఇలా వేళ్ళనుంచి నేలని పెళ్ళగించుకుని ఉపరితలంపైకి దూసుకువచ్చిన కవితా వృక్షం మాత్రమే బలంగా ఉంటుంది. గాఢంగా ఉంటుంది. చిక్కగా, చక్కగా తలెత్తుకుని అన్ని వృక్షాలమధ్య నిబ్బరంగా నిలబడుతోంది.

అలాంటి కవిత్వం కోసం నేను నిరంతరం Vegabond లా తెలుగు సాహితీ క్షేత్రాల వెంట సంచరిస్తూనే ఉన్నాను. వందలాది సృజనకారులు అవిశ్రాంతంగా సృష్టిస్తున్న వాక్యమేఘాల్ని పరికిస్తూనే ఉన్నాను... అవి మోసుకువస్తున్న భావాల తడిని స్పృశిస్తూనే ఉన్నాను. అయినా ఇంకా ఏదో తపన... దాహం తీరని స్థితే.... ఆ కవిత్వాలన్నీ ఫీలింగ్స్‌తో సంచరిస్తూ నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నన్ను ఎప్పటికప్పుడు ఆ భావం కింద నలిగిపోయేలా చేస్తున్నాయి తప్ప... ఆ బరువులోంచి తేలిక పరిచే దిశగా నన్ను నడిపించడం లేదు. నా గమనం ఆగలేదు. అలాంటి నా లోకసంచారంలో నాకెదురైన వ్యక్తి - అయినంపూడి శ్రీలక్ష్మి.

ఇక్కడే ఒక విషయం చెప్పాలి. కవిత్వం Spontaneous .... కానీ కవితారచన మాత్రం ఎన్నెన్నో మథనాల, మనోమంథనాల అంతిమరూపమే. మనసు నేలని పెళ్ళగించుకుని పైకి వచ్చే మొక్కే కవిత్వం అలాంటి ఎన్నెన్నో మనో సంచలనాల సంచయం నుంచి ఆవిర్భవించేదే కావ్య వృక్షం.

అలా ఎదిగిన వృక్షం – శ్రీలక్ష్మి కవిత్వం!

అలా ఒదిగిన వాక్యలోకం – శ్రీలక్ష్మి సాహిత్యం!!

ఈ 'మోనోలాగ్ ఆఫ్ ఎ వూండెడ్ హార్ట్' దానికి అక్షరమెత్తు సాక్ష్యం!!!

సాధారణంగా కవితా వృక్షం మన గుండెలకి నీడనిచ్చేలా, సేద తీర్చేలా ఉండాలి. Post Modernist Idealogy తో గమనిస్తే మనలోని యుగాల నాటి పెనుగులాటలని, అంతర్యుద్ధాలని చల్లబరిచే చికిత్సలా ఉండాలి. మనలోలోపలి అలజడులని ప్రతిబింబించడమే కాదు. ఆ సంఘర్షణలని కూడా అది నివృత్తిచేయాలి. అప్పుడు మాత్రమే కవిత్వానికి సంపూర్ణత్వం.... కవిత్వ ప్రయోజనానికి సార్థకత్వం.

నా అనవరత అంతర్–బహిర్ సాహితీ సంచార జీవనంలో, ఇటీవలి కాలంలో నాకు ఆ సంపూర్ణత – సార్థకత ఒకానొక చోట తారసపడింది. గుండెలోతులని ప్రక్షాళన చేసే కవిత్వం కోసం మండుటెండల్లో పయనిస్తున్న బాటసారికి నిజంగానే ఓ పచ్చనిచెట్టు నీడ లభించిన అనుభూతికలిగింది.

ఆ కవితా వృక్షమే – 'మోనోలాగ్ ఆఫ్ ఎ వూండెడ్ హార్ట్'!

**2**

*కవిత్వానికి ప్రయోజనముందా?*

కవిత్వం పుట్టినప్పటినుంచీ గ్రీకులను, రోమన్‌లను, ఈజిప్షియన్‌లను, చైనీయులను మాత్రమే కాదు భారతీయులను కూడా తొలుస్తున్న పెద్ద ప్రశ్న ఇది! ఈ ప్రశ్నకు సమాధానాన్ని తెల్సుకోవడానికి ముందు రెండో ప్రపంచయుద్ధానంతర బ్రిటిష్ కవులలో అత్యంత ప్రసిద్ధిగాంచిన కవి అయిన Ted Hughes గురించి తెల్సుకోవాలి. ఏడేళ్ళ బాల్యం నుండే కవిత్వం రాయడం మొదలెట్టిన ఈయన Hawk in the Rain (1957), Crow : From the life and songs of the crow (1970), River (1983). Flowers and Insects (1987) వంటి వైవిధ్యమైన రచనల ద్వారా ప్రపంచసాహితీ ఆకాశంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సాధించారు. సాహిత్యం వంటి కళాత్మక సృజనలు మానసిక సాంత్వనను మాత్రమే కాదు రోగనివారణని కూడా వాక్యాలవెంట తీసుకువస్తాయని, కవిత్వం ఈ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నెరవేరుస్తుందని ఆయన ఇలా ప్రకటించారు.

'Prose, narratives et cetera, can carry healing.

Poetry does it more intensely'

ఈ మాటలు పై ప్రశ్నకు కొంతవరకు సమాధానాన్ని చెపుతాయి. కవిత్వానికుండే వాస్తవిక, గుణాత్మక, పరిమాణాత్మక, పరిణామాత్మక ప్రయోజనాన్ని వివరిస్తాయి.

సాధారణంగా కవిత్వం – మనోల్లాసం, హృదయ చైతన్యం, ఉద్వేగ సంతులనం, జీవనవికాసం, మానసిక సాంత్వన వంటి Psychological ప్రభావాలనే చూపిస్తుందని అనుకుంటాము. కానీ కవిత్వానికి, శారీరకపరమైన అనారోగ్యాన్ని, భౌతిక ఆరోగ్య సమస్యలను సైతం నిదానం చేయగల సామర్థ్యం ఉందని ఆ మేరకు పాఠకులను ఫిజికల్‌గా సైతం ప్రభావితం చేయగలదని Ted Hughes మాటలు సరికొత్తగా ఆవిష్కరించాయి.

వేర్వేరు సందర్భాలలో సంగీతానికి రోగనివారణశక్తి ఉందని, ఆనారోగ్య సమస్యలను పరిష్కరించడానికి అలా ఉపయోగించే చికిత్సా విధానాన్ని Music Therapy అంటారని మనకు తెలుసు. మెడిసిన్స్, సర్జరీ, ఔషధాలకు అతీతంగా చేసే ఈ తరహా కళాత్మక చికిత్సా ప్రకియలలోకి కవిత్వం కూడా చేరి, ఇపుడు ‘పొయెట్రీ థెరఫీ’ అనే మాట ప్రముఖంగా వినిపిస్తోంది.

ఇప్పటివరకూ మనం కార్టూన్‌లలోనూ, నాటకాలలోను, సినిమాలోని కామెడీ ట్రాక్‌లలోనూ కవిత్వాన్ని ఓ పనిష్‌మెంట్‌గానూ, కవిత్వ భాష ‘చెవుల్లోంచి రక్తాలు కారేలా’ చేసే వెపన్‌గానూ మాత్రమే చూసాం. కారణాలేవైనప్పటికీ మీడియాలో సైతం కవిత్వం కేవలం హాస్యాస్పదంగా మాత్రమే మారి పోయింది. కానీ పాశ్చాత్య దేశాలలో కవిత్వానికి, కవితా పంక్తులకు ఉండే గౌరవం ఇప్పటికీ గొప్పగా ఉందనే చెప్పాలి. అందుకే అక్కడ కవిత్వం కేవలం భావోద్వేగాలను, హృదయోల్లాసాన్ని కలిగించే విశేష కళ అనే దశను దాటేసి, కవిత్వం ఓ చికిత్స అనీ కవితారచన, గానం, పఠనం చికిత్సలో అంతర్భాగమేననే దశకు వచ్చింది. యూరప్ వంటి దేశాలలోని ప్రముఖ వైద్య పరిశోధనా సంస్థలు, డాక్టర్లు దీనికి పొయెట్రీ థెరఫీ అనే పేరు పెట్టి, ప్రత్యామ్నాయ వైద్యం (Alternative Medicine) గా గుర్తింపునిచ్చారు. అమెరికా, జపాన్ వంటి మరికొన్ని దేశాల వైద్యాలయాలు ఈ విధానాన్నే Bibliotherapy అని కూడా పిలుస్తున్నాయి. సాహిత్యంలోని వివిధ ప్రక్రియలు, శైలులను ఉపయోగించి వ్యక్తులలో రోగనివారణ చేయడం, వారిలో సానుకూల ప్రగతిని (Positive Growth) రప్పించడం ఈ చికిత్స ప్రధానాంశం.

**ఇప్పుడు మళ్ళీ మన ప్రశ్నలోకి వద్దాం!**

అసలు కవిత్వ ప్రయోజనం ఏమిటి? ఈ చిరకాల ప్రశ్నకి సమాధానాల గురించిన అన్వేషణ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆ క్రమంలో ఇపుడు వచ్చిన భావన – 'కవిత్వ ప్రయోజనం– చికిత్స' అనేది. ఈ విషయం కొంత ఆశ్చర్యంగానూ, అనూహ్యంగానూ ఉండవచ్చు. కానీ ఈ Phenomenon ను వివరించడానికి ఒక్కసారి Psychology లోని కొన్ని అంశాలను పరిశీలిద్దాం. ఎందుకంటే సాహిత్యం, కవిత్వం మానవ మేధస్సులోంచి, మస్తిష్కంలోంచి ఉద్భవించే ఉత్పన్నకాలు. మనోజనితాలు. (Poetry and literature is the product of imagination and creativity. They have the origin in human mind.) కనుక ఈ అంశాన్ని Psychological Science లోని Psycholinguistics కోణం లోంచి విశ్లేషించడం అవసరం.

Psychology లో Psycho-somaticism, Somato-psychicism అనే రెండు దృగ్విషయాలని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. Psycho-somaticism అంటే మానసికపరమైన అంశాలు మనిషి శారీరక అంశాలని ప్రభావితం చేయడం. అలాగే Somato-psychicism అంటే, మనిషి శారీరక – భౌతిక పరమైన అంశాలు మనసు స్థితిగతులను నిర్ణయించడం అని చెప్పాలి. అంటే మనసు – శరీరాన్ని, శరీరం – మనసుని పరస్పరం ప్రభావితం చేసుకుంటూ ఉంటాయన్న మాట. ఈ అంశాన్నే Philosophy లో Rene Descartes 15వ శతాబ్దంలోనే Body-Mind Dichotomy అనీ "మనశ్శరీరాల ద్వంద్వత" అనీ అన్నారు. ఈ ద్వంద్వత ఒకదానినొకటి పరస్పరం ప్రభావితం చేసుకుంటూ ఉంటాయని, ఆ ప్రభావాల ఫలితమే మనిషి ప్రవర్తన అనీ వివరించారు.

కవిత్వం మనోజనితమూ, మానసికగతమూ కనుక కవితా వాక్యాలు, అక్షరాలు, భావచిత్రాలు, ఉపమానాల ద్వారా అనారోగ్యంపాలైన మనిషిలో స్థైర్యాన్ని, శాంతిని ఏర్పరిచి తద్వారా శరీరంలో కూడా తదనుగుణమైన పాజిటివ్ ఛేంజెస్ తీసుకురావడం జరుగుతుందన్నమాట. ఇదంతా చదివిన తర్వాత నిజానికి కవిత్వానికి, కవిత్వంలోని భావాలకి అంత ప్రభావం ఉంటుందా? అనే మరో ప్రశ్న ఉదయిస్తుంది. దీనికి సమాధానం చెప్పాలంటే Psychology లోని మరో రెండు భావనలని కూడా ఇక్కడ ఉదహరించాలి. అవే (1) Placibo Effect (2) Nocibo Effect

శారీరకంగానూ, ఔషధాల ద్వారానూ మనిషిలోని రోగాన్ని నయం చేయలేమని డాక్టర్లు సైతం చేతులెత్తేసిన సందర్భంలో, రోగి మనసులో బలంగా పాదుకున్న పాజిటివ్ థాట్స్ – సానుకూల సంకల్పం శరీరాన్ని,

భౌతికస్థితిని దానికి అనుగుణంగా సమాయత్తం చేసి ఆ వ్యక్తిని ప్రమాదం నుంచి తప్పించగలిగే మానసికస్థితి– Placibo Effect!

అలాగే, శారీరకంగానూ, మెడిసిన్ పరంగానూ రోగాన్ని మటుమాయం చేయగలమని డాక్టర్లు భావించినప్పటికీ, రోగి మస్తిష్కంలో రూపొందిన నెగెటివ్ ఆలోచనలు మొదట మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసి, ఆ తర్వాత క్రమంగా శారీరకంగా సైతం వ్యక్తిని కృంగదీసేస్థితి – Nocibo Effect!

ఈ రెండు ఎఫెక్ట్‌ల వెలుగులో చూస్తే, మిగతా అన్నిరకాల కళారూపాలు, సాహిత్యంలోని ఇతర ప్రక్రియలకన్నా కవిత్వానికి, కవిత్వంలోని వాక్యాలకి మనుషులను ప్రభావితం చేసే శక్తి కొంచెం ఎక్కువే ఉంటుందనేది తేటతెల్లమవుతుంది. ఈ విషయాలన్నింటినీ కూలంకషంగా గమనించారు కనుకే దాదాపు 30 ఏళ్ళ క్రితమే అమెరికాలో National Association for poetry therapy అనే పరిశోధనా సంస్థని ఏర్పాటు చేశారు. షికాగోలో జరిగిన అంతర్జాతీయ వైద్య సదస్సు ఈ ఆలోచనకు కార్యరూపం ఇచ్చింది. రోగులకు వ్యాధుల వల్ల వచ్చే బాధను కవిత్వాన్ని ఉపయోగించి తగ్గించి, తద్వారా వారికి సహాయం చేయాలని ఈ సదస్సు తీర్మానించింది. ఈ సంస్థలోని సభ్యులు అంతర్జాతీయంగా పేరెన్నికగన్న డాక్టర్స్, థెరపిస్ట్‌లే కావడం గమనార్హం. కాగా ఈ సంస్థ సుదీర్ఘకాల పరిశోధనల అనంతరం పొయెట్రీని ఆధారంగా చేసుకుని Integrative Medicine Packet అనే చికిత్సా విధానాన్ని రూపొందించి, శిక్షణను కూడా ఇవ్వడం మొదలెట్టింది. ఈ శిక్షణా కోర్సుని సక్రమంగా పూర్తి చేసిన వారికి Registered Poetry Therapists (RPT) గా కూడా పట్టాలు ప్రదానం చేస్తుంది. ఇలా పొయెట్రీ థెరపీ పేరిట కవిత్వ ప్రయోజనం ఇప్పుడు సువ్యవస్థీకృతం అయింది. కవిత్వానికి చింతకాయలు రాలుతాయో లేదో తెలీదు కానీ, చింతలు మాత్రమే కాదు చిరకాల వ్యాధులు కూడా నయం అవుతాయని సాధికారికంగా ఈ సంస్థ నిరూపిస్తోంది.

## 3

మహా కవి శ్రీశ్రీ కవితా వస్తువు గురించి చెపుతూ 'కాదేదీ కవితకనర్హం' అన్నారు. తెలుగులో తొలి సాహిత్యమైన నన్నయ విరచిత మహాభారతం నుండి మొదలుకొని నేటి అత్యాధునిక కవిత్వం, తెలంగాణా, ఇతర అస్తిత్వవాద కవిత్వాల వరకూ ఆయా కవులు తమ కవితల కోసం ఎంపిక చేసుకున్న కవితా వస్తువులను గమనిస్తే శ్రీశ్రీ మాటలు నిజమే అనిపిస్తాయి. మనిషిని పరివేష్టించి ఉన్న అన్ని అంశాలను కవితా వస్తువులుగా చేసుకుని వేలాది కవితలు వచ్చాయి. అయితే ఇవన్నీ

ప్రధానంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, చారిత్రక, అస్తిత్వవాద, ప్రాంతీయ వాద, తాత్విక ధోరణులను ఆశ్రయించే ఉన్నాయని చెప్పాలి. ఇన్ని అంశాలలో మనిషికి సంబంధించిన మరో అనివార్య కవితా వస్తువు– ఆరోగ్యం! ఈ ఆరోగ్యం – వ్యాధులు, దాని సంబంధిత అంశాలను, కవిత్వంలో ఉపమానాలుగా, ఉదాహరణలుగా, సంకేతాలుగా Symbolism తోనే వాడారు తప్ప, వీటినే ప్రధాన వస్తువుగా చేసుకుని చేసిన కవితా రచనలు అత్యంత అరుదుగానే వచ్చాయని చెప్పాలి. (అయితే మనిషిలోని మానసిక పరమైన అంశాలైన డిప్రెషన్, మనోవేదన, ఆత్మహత్య వంటి అంశాలే వస్తువులుగా ఎన్నెన్నో కవితలు రకరకాల నేపథ్యాలతో రావడం విశేషమే.)

అయితే ఏదో ఒక వ్యాధిని కేంద్రవస్తువు (Central Theme) గా చేసుకుని వచ్చిన రచనలు తెలుగులో విస్తృతంగా రాకపోయినప్పటికీ, ఈ వ్యాధులు, వ్యాధిగ్రస్తులకు నెలవు అయిన హాస్పిటల్–దవాఖానాను వస్తువుగా చేసుకుని కొన్ని బలమైన కవితలు వచ్చాయి. వాటిలో కె. శివారెడ్డి రాసిన దీర్ఘ కవిత 'ఆసుపత్రిగీతం' చెప్పుకోదగింది.

కాగా, ఇంగ్లీష్ సాహిత్యంలో సైతం మానవ వ్యాధులే వస్తువులుగా వచ్చిన కవిత్వం కూడా తక్కువగానే ఉంది. అయితే అమెరికన్ కవి, ప్రొఫెసర్ డేవిడ్ ఫెర్రీ రాసిన At the Hospital అంతర్జాతీయస్థాయిలో పేరెన్నికగన్నది.

"She was the sentence the cancer spoke at last,

Its blurred grammer finally varified" అనే రెండు పంక్తులలోనే ఉన్న ఈ కవిత అనల్పార్థాన్ని సూచిస్తుంది.

అలాగే అమెరికన్ నవలా రచయిత, కవి జేమ్స్ డిక్కీ రాసిన 'The Hospital Window' వంటి కవితలు ఆసుపత్రి వాతావరణాన్ని, రోగుల మానసిక స్థితిగతులను వివరించాయి. ఈ కవితలో ఆయన ఆసుపత్రి గది వాతావరణాన్ని

"Each window possesses the sun
As though if burned there on a wick
I wave, like a man catching fire
All the deep-dyed windowpanes flash,
And behind them, all the white rooms
They turn to the color of heaven" అని దృశ్యీకరించారు.
అలాగే ఆ గదులలోని మనుషుల మానసిక స్థితిని
Ceremoniously, gravely and weakly
Dozens of pale hands are waving
Back, from inside their flames" అని చిత్రించారు.

ప్రముఖ రష్యన్ రచయిత Alexander Solzhenitsyn రాసిన ఆత్మకథాత్మక నవల The Cancer Ward (1967) నికూడా ఇక్కడ ఉదహరించాలి. హాస్పిటల్‌లోని ఒక వార్డు నేపథ్యంలో ఆనాటి రష్యన్ సామాజిక-రాజకీయ-ఆర్థిక ముఖ చిత్రాన్ని సింబాలిక్‌గా ఆవిష్కరించింది. ఈ రచన. దీనినే ఈ నవలలోని ఓ పాత్ర Pavel Nikoloayewich ద్వారా రచయిత ఇలా చెప్పించారు.

"We always think of death as black. But its only the preliminaries that are black. Death itself is white"

కాగా 1955 ప్రాంతంలో ఉజ్బెకిస్తాన్‌లోని ఓ హాస్పిటల్‌ని ఈ నవలకు నేపథ్యంగా పైకి చూపించినప్పటికీ, అంతర్గతంగా ఆనాటి స్టాలిన్ పాలనలోని రష్యా మొత్తం 'క్యాన్సర్ వార్డ్' లా ఉందని చెప్పడమే ఈ నవల ఉద్దేశమని అర్థం చేసుకోవాలి. ఇదే భావనని ఈ నవలలోని ప్రధాన పాత్రధారి అయిన Kostoglotov మాటలలో ఇలా వ్యక్తీకరించారు.

"A man dies from a tumour. So how can a country sur-
vive

with growths like labour camps and exiles".

ఇక ఫ్రాంక్ బిడార్ట్ అనే అమెరికన్ ఆధునిక కవి రాసిన 'Ellen West' అనే దీర్ఘకవిత, ఫోకస్డ్‌గా ఒక వ్యాధి మీద రాసిన కవితలలో అగ్రగణ్యమైందిగా ప్రశంసలు పొందింది. ఆయన ఈ కవితలో Anorexia Nervosa రోగి (కడుపు నిండా తింటే ఎక్కడ లావైపోతామో అనుకుని తిండి తినని వారు) స్థితిని Existential Psychology దృక్కోణంలోంచి వివరించే ప్రయత్నం చేశారు.

ఆ లెక్కన, మానవులను పట్టి పీడిస్తున్న ఒక వ్యాధిని వస్తువుగా తీసుకుని తెలుగులో వచ్చిన తొలి దీర్ఘ కవితగా ప్రస్తుత 'మోనోలాగ్ ఆఫ్ ఎ వూండెడ్ హార్ట్' అపూర్వమైన స్థానాన్ని సాధించింది.

**4**

'ఎవరి బాధను వారే చెప్పడం. ఎవరి గోసను వారే కవిత్వీకరించడం' అనేది ఈ యుగధర్మం. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన అన్నిరకాల అస్తిత్వవాద, ఆధునికవాద ఉద్యమాలన్నింటికీ ఈ సూత్రమే మూలాధారం.

అందుకే Poetry Therapy లో భాగంగా రాసే వ్యాధుల నేపథ్య కవిత్వానికి కూడా ఈ సూత్రమే ఆధార భూమిక అయింది.

అలా ప్రస్తుత ప్రపంచంలో అధిక సంఖ్యాక ప్రజలను శారీరకంగానూ, మానసికంగానూ వేదనకు గురి చేస్తున్న వ్యాధి - బ్రెస్ట్ క్యాన్సర్!

ఈ బ్రెస్ట్ క్యాన్సర్ రోగపరంగా శారీరకమైనదే అయినా దానితోపాటే సామాజికంగా, మానసికంగా విస్తృత వేదనను (Agony) వ్యాధిగ్రస్తులకి అందిస్తోంది. పైగా ఇది స్త్రీలలోనే ప్రధానంగా పొడసూపుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్త్రీలు ఎదుర్కొంటున్న ఎన్నెన్నో సమస్యలకు తోడుగా ఈ సమస్య కూడా జోడయింది.

దాంతో వస్తువుగా బ్రెస్ట్ క్యాన్సర్ పైన వచ్చిన కవిత్వం 'ఫెమినిస్ట్ కవిత్వం'గా కూడా మారిపోయింది. దీనికి Kyle Potvin రాసిన Sound Travels on Water (2012) కవితా పుస్తకమే మంచి ఉదాహరణ. 6 సంవత్సరాల పాటు బ్రెస్ట్ క్యాన్సర్‌తో పోరాటం చేసిన Kyle తన అనుభవాలు, బాధలు, జ్ఞాపకాలను ఈ కావ్యంలో ఇలా వివరించింది.

"Last week we stood on opposite coasts
on the Florida side
waves ran at my feet
snatching bits of sand
from underneath,
Persistant
As the land-grabbing cancer
Cells inside me
I wondered how long
I could stand before, unbalanced,
l'd float away, buoyant and hollow-
empty as a Jelly fish" అంటూ క్యాన్సర్‌ని తనలో కనుక్కున్నప్పటి స్థితిని సముద్ర అలలవేగానికి తన పాదాల కింద ఇసుక జారుతున్న తీరుతో అన్వయించి చెప్పింది.

41 ఏళ్ళ వయసులో ఈ వ్యాధిని గుర్తించిన ఆమె మొదట్లో తీవ్రంగా కృంగిపోయింది. ఎవరికీ చెప్పుకోలేని ఒంటరితనంతో మధనపడింది. చివరికి తన మనోవేదనకు ఔట్‌లెట్‌గా కవిత్వాన్ని భావించి, తన భావాలన్నింటినీ కవిత్వీకరించింది. అలా కవితలలో తన వేదనను వెళ్ళగక్కుకుని బ్రెస్ట్ క్యాన్సర్‌ని ఎదుర్కొనే స్థైర్యాన్ని పెంచుకుంది.

కవిత్వం ఒడిలో తను వ్యక్తిగతంగా పొందిన ఉపశమనాన్ని, సాంత్వనని ఇతర బ్రెస్ట్ క్యాన్సర్ పీడితులకు కూడా అందించాలనే సంకల్పంతో Kyle, The Prickley Pear Poetry Project పేరిట ఓ వ్యవస్థనే ఏర్పాటు చేసింది. క్యాన్సర్ వ్యాధి గురించిన అనుభవాలను కవిత్వ రచన, వక్తీకరణ ద్వారా చెప్పుకోవడం వల్ల, ఈ వ్యాధిగ్రస్తులు ఓ రకమైన Cathartic Experience పొంది తేలికపడే అవకాశం ఏర్పడింది.

Bonnie Maurer అనే మరో బ్రెస్ట్ క్యాన్సర్ బాధితురాలు 'Hymn to A Lost Breast' అనే కవితలో

"Oh, I am gone,
I am long
I am a lazy drift
of milk weed in the air
daydream somewhere,
atoms returning to the stars" అని క్యాన్సర్ కారణంగా తను పోగొట్టుకున్న బ్రెస్ట్ గురించి రాసింది. ఇలా ఆమె బ్రెస్ట్ క్యాన్సర్ మీద మరెన్నో కవితలను రాసి, వాటిని The Reconfigured Goddess : Poems of a Brest Cancer Survivor అనే కావ్యంగా వెలువరించింది. ఈ కావ్యం ఆమెకు మాత్రమే కాక, ఇది చదివిన ఇతర బ్రెస్ట్ క్యాన్సర్ పీడితులలో సైతం భయాలను తొలగించడంలో ఎంతో సహకరించింది.

కవిత్వం థెరపీగానే కాక, సామాజికంగా సైతం ఒనగూడుతున్న ఈ విస్తృత ప్రయోజనాన్ని గమనించిన Tesora Books అనే ప్రచురణ సంస్థ The Cancer Poetry Project 2 పేరిట ఇటీవలే కవితా సంకలనాన్ని ముద్రించింది. క్యాన్సర్ పేషెంట్స్ స్వయంగా రాసిన కవితలతో కూడిన ఈ కావ్యం, ఆ కోవలో తొలి ప్రయత్నంగా రికార్డులకెక్కింది.

అయితే, క్యాన్సర్‌ని వస్తువుగా చేసుకుని కవితా రూపంలో వస్తున్న రచనలు ఇటీవలి కాలానివే అని చెప్పాలి. క్యాన్సర్ ప్రధాన థీమ్‌గా తీసుకుని సాహిత్యంలోని ఇతర ప్రక్రియలలో 1970 దశకంలో కొన్ని ప్రయోగాలు జరిగాయి.

అలా 1978లోనే 'Tissue' పేరిట ఓ నాటకం వచ్చింది. Louis Page అనే బ్రిటిష్ రంగస్థల కళాకారిణి, రచయిత్రి ఈ నాటకాన్ని రాసింది. ఈ నాటక ప్రదర్శన ద్వారా స్త్రీలలో బ్రెస్ట్ క్యాన్సర్ గురించిన అవగాహనను ఆమె ప్రచలితం చేయగలిగింది.

అయితే, భారతీయ సాహిత్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై రచనలేవీ ఇప్పటివరకూ అంతగా రాలేదు. కానీ Tissue నాటకాన్నే 'Ek Rikami Baju' పేరుతో రచయిత ప్రదీప్ వైద్యా మరాఠీలోకి అనువదించారు. శ్రీకాంత్ భిడే దర్శకత్వం వహించిన ఈ నాటకాన్ని మార్చి 2013లో పూనేలో జరిగిన 'అర్పణ్' నాటకోత్సవంలో ప్రదర్శించారు. 20 పాత్రలతో, 45 సీన్లతో కూడిన ఈ నాటకంలో ఓ బ్రెస్ట్ క్యాన్సర్ బాధితురాలు, తన

ఎడమ వక్షోజాన్ని సర్జరీలో పోగొట్టుకున్న తర్వాతటి శూన్యతని ఎదుర్కొన్న తీరు, ఆమె తన జీవితాన్ని ధైర్యంతో మళ్ళీ ఆరంభించిన తీరు ఎంతో ఇన్‌స్పైరింగ్‌గా అందించారు.

**5**

బ్రెస్ట్ క్యాన్సర్ అంశంమీద తెలుగులో కూడా కొంతమంది కవయిత్రులు కవిత్వాన్ని రాసారు. వాటిలో ప్రముఖంగా ప్రస్తావించుకోవలసిన కవిత – పాటిబండ్ల రజని రాసిన 'ఒంటిపొద్దు ఆకాశం' (ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం– నవంబర్, 2007). ఆమె ఈ కవితలో భార్యాభర్తల దాంపత్య జీవనాన్ని కేవలం లైంగిక పరమైందిగా "*కళ్ళకూ చేతికీ తగిలేదే హృదయమన్న భౌతిక వాస్తవికత*"గా మాత్రమే దర్శిస్తున్న పురుషుడి ఆలోచనా ధోరణిని ప్రశ్నించింది.

ఇక నా అంచనా మేరకు తెలుగులోనే కాక మొత్తం భారతీయ భాషలలోనే బ్రెస్ట్ క్యాన్సర్ వస్తువుగా దీర్ఘకవితా ప్రక్రియలో వచ్చిన తొలి రచన బహుశా 'మోనోలాగ్ ఆఫ్ ఎ వూండెడ్ హార్ట్' నేనేమో! అయితే ఈ కవిత ఇతర భాషా కవితలకు లాగా కవి స్వీయానుభవం నుంచి వచ్చింది కాకపోయినప్పటికీ, ఈ కవయిత్రిలోని 'ప్రపంచం బాధను తన బాధ గానూ, తన బాధ్యతగానూ చేసుకునే' 'Empathetic Attitude' ఒకవైపు, మూలాల అన్వేషణ మరొకవైపు కలిసి ఆమెచేత ఈ కవిత్వాన్ని రాయించి ఉంటాయని

*"ఇప్పటిదాకా మనం*
*ఎక్సోడస్‌నే సెలబ్రెట్ చేసుకున్నాం.*
*ఇప్పుడు*
*తొలిఅడుగు రూట్స్‌ని అన్వేషిద్దాం*
*ఇప్పటిదాకా మనం*
*దేహం గురించి చర్చోపచర్చలు చేశాం*
*ఇప్పుడు*
*దాని ఆదిమకణం గురించి*
*డిసెక్షన్ చేద్దాం"* అని తన తొలి వాక్యాలలో అనడంలోనే మనకు అర్థం అవుతుంది. అలాగే, బ్రెస్ట్ క్యాన్సర్‌తో సతమతమవుతూ, అనేకరకాల అపోహలతో కృంగి కృశించిపోతున్న మహిళల స్థితిని

*"మహాసంక్షోభానికి*
*మహా విపత్తే అక్కర్లేదు*

ఒక్కకణం కన్నెర్ర చాలు" అని వాస్తవిక ధోరణిలో చెపుతూనే వారిలో ఒకింత ధైర్యాన్ని, స్థైర్యాన్ని, జీవితంపై ఆశల్ని చిగురింప జేయాలనే సమున్నత ఆశయంతో ఆమె ఈ రచన చేసినట్లుగా అనిపిస్తుంది. నిర్దిష్టంగానూ, స్పష్టంగానూ కవిత్వానికి ఉండే ఓ సామాజిక ప్రయోజనాన్ని ఆశించి ఆమె ఈ కావ్యాన్ని సృష్టించినట్లుగా కూడా అవగతం అవుతుంది.

## 6

కవిత్వ ప్రయోజనంలో 'చికిత్స' గురించిన 'విచికిత్స' చేస్తూ అధ్యయనం చేస్తున్న క్రమంలో, పొయెట్రీ థెరపీకి ఈ క్రింది లక్షణాలు, లక్ష్యాలుంటాయని నేను నిర్ధారించుకున్నాను.

1. వ్యాధి గురించిన అవగాహన కల్పించడం (Awarness Creation)
2. అపోహలు తొలగించడం (Clearance of misconceptions)
3. వ్యాధిని అంగీకరించగలిగే మానసిక సంసిద్ధత (Mental Preparation)
4. వ్యాధిని ఎదుర్కోగలిగే స్థైర్యాన్నివ్వడం (Confidence Building Measures)
5. వ్యాధి నయంకావడం (Cure from Disease)
6. వ్యాధితో సైతం గౌరవంగా బ్రతకగలిగే ఆశావాదాన్ని పాదుగొల్పడం (Living with Disease with honour and Respect)

ఈ లక్ష్యాల వెలుగులో చూస్తే, అయినంపూడి శ్రీలక్ష్మి రాసిన ఈ దీర్ఘకవిత నూటికి నూరుపాళ్ళు సక్సెస్ అయిందనడంలో నాకెలాంటి డౌట్ లేదు. (ఈ దీర్ఘకవితను చదివిన తర్వాత మీరు కూడా నాతో అంగీకరిస్తారనుకుంటాను).

కవిత్వాన్ని చికిత్సా స్థాయికి తీసికెళ్ళే దిశలో ఈ "వూండెడ్ హార్ట్" దీర్ఘకవిత తెలుగులో నిజాయితీతో కూడిన విశుద్ధమైన ప్రయత్నమని కూడా నేను ఘంటాపథంగా చెప్పగలను.

ఇలా కవితావస్తువు పరంగా ఎంతో నవ్యతను – వైవిధ్యతను ప్రోదిచేసుకున్న ఈ దీర్ఘకవిత శిల్పం, ప్రయోగం, పదచిత్రాలు, విస్తృతి, శైలిపరంగా కూడా మరెన్నో విశిష్టతలను కలిగి ఉందని కవితా వాక్యాలలోకి వెళితే వెల్లడవుతుంది.

"సునామీ తెల్సు
భూకంపం తెల్సు

*గ్రహశకలాలు తెల్సు*
*అణువిస్ఫోటనం తెల్సు*

*కణవిస్ఫోటనం మాత్రం కొత్తదే కదా"* అని అనడంలో ప్రాపంచిక గమనం నేపథ్యంలో, దేహాంతరంగంలోని అలజడిని సున్నితంగా టేకాఫ్ చేసిన తీరు తర్వాతి పంక్తులలో రాబోయే సంఘర్షణకు మంచి ప్రాతిపదికను ఏర్పరిచింది.

అలాగే మన సామాజిక జీవనంలో గృహిణిగా స్త్రీ నిర్వర్తించే బాధ్యతలని అలతి అలతి పదాలతో ఎంత చక్కగా అభివ్యక్తీకరించారో చూడండి.

*"మా ఇంటికి అనధికారిక కోడి కూతనునేను*
*నేను మంచం పైనుంచి లేచినపుడే*
*మా ఇంటికి వేకువ వస్తుంది".*

అదే సమయంలో బ్రెస్ట్‌క్యాన్సర్ భయాలని తొలిసారిగా గుర్తించిన తీరును, *"సబ్బు నురగల పరుగు మధ్య*
*ఎదపై ఉండలు కట్టిన కండరం*
*దేహరహదారిపై*
*స్పీడ్ బ్రేకర్"*గా భావించడం, దానికి కారణాలను పరిపరి విధాలుగా ఊహిస్తూ –
*"అర్ధరాత్రి ఆయన వీరావేశం వల్లో*
*పాలు తాగుతూ చంటిది కొరికినందుకో"* అనుకోవడం స్త్రీ ఆలోచన ధోరణిని అత్యంత వాస్తవికంగా ఛిత్రికపట్టింది.

అలాగే కుటుంబంలో ఎవరికైనా ఏమైనా అనారోగ్యం సంభవిస్తే "హాస్పిటల్ మెట్లు"గా మారి, *"జీవితాన్ని అందరికోసం ముక్కలుగా విభజించుకుని", "అందరి విషయంలో థింక్ పాజిటివ్ – బీపాజిటివ్"*గా భావించే స్త్రీ హృదయంలోని త్యాగనిరతిని ఎంతో బాధ్యతగా Portray చేసింది.

క్యాన్సర్ హాస్పిటల్‌లోని స్థితిని, వ్యాధిగ్రస్తుల మనోపరిస్థితిని
*"సందేహం కుంచెను*
*భయం కలర్స్‌లో ముంచి*
*భవిష్యత్ క్యాన్వాస్ చిలికించిన*
*అబ్సర్డ్ చూపులతో"* ఒడిసిపట్టింది కవయిత్రి.
ఇక ఎదఎత్తులని *"స్త్రీనన్న అస్థిత్వాన్ని గుర్తు చేసిన*

*ఆత్మగౌరవ ప్రతీకలుగా"* చెపుతూనే
*"మగాళ్ళలో కర్ణుడు మాత్రమే*
*సహజ కవచకుండలాలతో పుట్టాడట.*
*కానీ స్త్రీలందరూ*
*కర్ణులు అయింది వీటివల్లేకదా"* అనే పౌరాణిక సామ్యాన్ని ఎంతో కన్విన్సింగ్‌గా, Divergent thought తో సరికొత్తగా ఆవిష్కరింపచేయడం కవయిత్రికే చెల్లింది.

మనం మన జీవన యాత్రలో అనివార్యంగా ఎంతో మంది ఆప్తులను, ఆత్మీయులను కోల్పోతాం. ఆ 'పోగొట్టుకోవడం' మనలో శూన్య భావనని నింపడమే కాదు. అప్పటివరకూ అమలులో వున్న సార్వత్రిక సత్యాలను కూడా సందేహించే స్థితికి మనల్ని నెట్టివేస్తుంది. అపుడు,

*"భూమి గుండ్రంగా ఉందని*
*నా గుండెలపై* చెయ్యేసుకుని
*ధైర్యంగా* చెప్పేదాన్ని
*ఇపుడు–*
*బల్లపరువుగా ఉందని చెప్పాలేమో..."* అనే మీమాంస పొడసూపుతుంది. ఆ మీమాంసలోంచే కొత్త ఆలోచన, నవ్య ఊహన మొగ్గతొడుగుతుంది.

*"ఆకులు రాలడమంటే*
*వసంతం ఆగిపోవడం కాదనీ",*
*"ఉరోజ రాహిత్య దశని*
*ఇన్నాళ్ళూ స్త్రీత్వం పేరిట*
*వేసిన సంకెళ్ళ నుండి విముక్తిగా"* భావించాలనే నవనవోన్మేష భావనకి స్వాగతం పలుకుతుంది.

ఇలా, 'వూండెడ్ హార్ట్' గా గాయపడ్డ గుండె వేదనల అనుభూతులను మూటగట్టుకుని వెల్లువెత్తిన ఈ దీర్ఘకవిత, క్రమక్రమంగా తన నడకలో ఓ ఆత్మ ప్రక్షాళననీ ప్రపంచానికి అందించి, చివరగా దుఃఖపడి కుంచించుకుపోయే సాటి మహిళామూర్తుల గుండెలనిండా కావలసినంత ధైర్యాన్ని, స్థైర్యాన్నీ ఇచ్చే దిశగా సాగుతుంది. సగటు మహిళ మనస్తత్వం నుండి మొదలైన ప్రస్థానం చివరికి ఆమె *"షీగా కాకుండా మని'షి'గా జీవించాల"నే స్ఫూర్తినీ," 'జెండర్'గా కాకుండా జెండాగా నడవాల"*నే జీవన లక్ష్యాన్ని రగిల్చి కవిత్వ ప్రయోజనానికి సరికొత్త అర్థాన్ని అందించింది.

ఈ దీర్ఘకవిత, కవిత్వమంటే "Powerful feelings" అనే భావనతో మొదలై, భూగోళమంత ఎగొనీని కవిత్వం ద్వారా మాత్రమే చెప్పాలనే ఆత్మ ప్రక్షాళన (Catharisis) పథంలో పయనించి, కవిత్వాన్ని therapy గా నిలబెట్టే ప్రయత్నం చేసింది. కవిత్వ ప్రయోజనం అన్న మాటకు విస్తృతార్థాన్ని ఆపాదించింది.

ఈ సార్వజనీన జీవలక్షణం ఈ అక్షరాలనిండా ఒలికిపోయింది కనుకే, ఈ పుస్తకాన్ని మూసేసిన తర్వాత, ఈకవిత Monologue కాదనీ లక్షలాది స్త్రీల అవ్యక్త Scream కి అక్షరరూపమని అర్థమై వెన్ను పూసలోంచి జలదరింపు వస్తుంది.

**7**

చాలామందికి కవిత్వం మానసికం.

ఇంకా చాలా మందికి, కవిత్వం కేవలం పఠించేపుడు పెదాలకి, వినేపుడు చెవులకి మాత్రమే పరిమితమైన Selective శారీరకం.

కానీ, నాకు తెల్సినమేరకు శ్రీలక్ష్మికి కవిత్వం జీవితం. ప్రతిబంధకాలన్నీ అధిగమిస్తూ తన జీవితాన్ని ఎప్పటికప్పుడు తీర్చిదిద్దుకుంటూ ఎలా పురోగమిస్తుందో, కవిత్వాన్ని కూడా ఎప్పటికప్పుడు మరింత మెరుగుపర్చుకుంటూ తన కవిత్వాన్ని సజీవంగా నిలుపుకుంటోంది. శ్రీలక్ష్మి కవిత్వంలో ప్రధానంగా మూడు లక్షణాలు నాకు కనిపిస్తాయి.

1. వస్తు నవ్యత
2. ప్రయోగాత్మక శైలి
3. వైవిధ్య శిల్పం

ఆమెలోని ఈ సృజనాత్మక లక్షణాలే గతంలో 'లైఫ్ @ చార్మినార్' దీర్ఘకవితని "డాక్యుపోయెమ్"గా మలిచి జాతీయస్థాయిలోనే తొలి ప్రయోగంగా తీసుకొచ్చేలా చేసాయి. ఇపుడు కూడా 'బ్రెస్ట్ క్యాన్సర్' అనే అంశంపై దేశంలోనే మొట్టమొదటి దీర్ఘకవితని వెలువరించేలా చేస్తున్నాయి. ఈ నవ్య ఆలోచనాధోరణి, నవసృజన, ఆమె సాహితీ ప్రపంచానికి సూర్యచంద్రులు...

తెలుగు సాహితీ జగత్తులోనే విశిష్ట ప్రయోగాలుగా నిలిచిపోగలిగిన 'లైఫ్ @ చార్మినార్'కు, "మోనోలాగ్ ఆఫ్ ఎ వూండెడ్ హార్ట్"కు ముందుమాట రాయడం ద్వారా అయినా, శ్రీలక్ష్మి కావ్యయజ్ఞంలో పాల్గొనే అవకాశం కలిగినందుకు నాకు 'జరంత ఖుషీ'గానే ఉంది.

బ్రెస్ట్‌క్యాన్సర్ అనే సెన్సిటివ్, కాంప్లెక్స్ టాపిక్‌ని ఎంతో కవితాత్మకంగానూ, మరెంతో ఈస్తటిక్స్‌ని అక్షరాలలో పొదిగించి ఈ దీర్ఘకవితని ఓ కావ్యతరువుగా నిలబెట్టిన శ్రీలక్ష్మిలోని సానుభూతికి, సహానుభూతికి, ఈ దీర్ఘకవితని ఆసాంతం చదివిన తర్వాత నమస్సులు చెప్పకుండా ఉండలేము.

ఆమె నాటిన ఈ కవితావృక్షం నీడలో లక్షలాది మహిళలు, బ్రెస్ట్‌క్యాన్సర్ బాధితులు సేదతీరుతారని, ఈ అక్షరాల ఆకులని తడిమి స్ఫూర్తిని పొంది బ్రెస్ట్ క్యాన్సర్‌పై పోరాడి గెలిచి, నిలిచే సత్తాని సాధిస్తారని, కవిత్వ ప్రయోజనాన్ని ఆచరణలో చూపిస్తారని ఆశిస్తాను.

చివరగా, నాదృష్టిలో–

ఓ కవిత పాఠకుణ్ని ఆనందింపచేస్తే – కవి ఊహాజీవిగా గెలిచినట్టు!

ఆలోచింపచేస్తే – కవి మేధావిగా నిలిచినట్టు!!

ఆశని చిగురింపచేస్తే – కవి సృజనకారుడిగా వెలిగినట్టు!!!

కానీ స్ఫూర్తిని రగిలించగలిగినపుడు మాత్రమే కవి కవిత్వానికి ఓ ప్రయోజనాన్ని సాధించినట్టు!

నిజమైన కవిగా మిగిలినట్టు!

అలాంటి నిజమైన కవిగా అయినంపూడి శ్రీలక్ష్మిని ఈ దీర్ఘకవిత ఇప్పుడు తెలుగు కవితాలోకంలో అత్యున్నత స్థానానికి తీస్కెళ్ళిందని నా భావన...

**(మామిడి హరికృష్ణ)**


G2, చల్లాటవర్స్,

దిలీప్ సూపర్‌మార్కెట్ ఎదురుగా,

పుప్పాలగూడ, రాజేంద్రనగర్, హైదరాబాద్ – 89.

9908844222

harikrishnam2110@gmail.com



# ఒకింత...

మా నానమ్మ నాతో ఎప్పుడూ ఓ మాట చెప్పేది

"నువ్వెక్కడికి వెళ్ళినా డబ్బు సంచీలు పట్టుకెళ్ళటం కంటే కాసిన్ని చిరునవ్వులు మూటకట్టుకెళ్ళు – నవ్వలేని నిర్భాగ్యులెవరైనా కన్పిస్తే ఓ నవ్వు దానం చెయ్యి. నవ్వు కున్న శక్తి... సానుకూల దృక్పథం డబ్బుకి రాదు" అని

ఆవిడ ఏ ముహూర్తంలో ఆ మాట చెప్పిందో కానీ నా హృదయంలో శిలాక్షరాలుగా నిలబడిపోయాయి – నా జీవితంలో అన్నీతానే అయిన నానమ్మ క్యాన్సర్‌తో చనిపోయినప్పుడు కూడా నా నవ్వుని నేను కాపాడుకునే వున్నాను. నాదందుకే ఎప్పుడూ సానుకూల దృక్పథం – సహానుకూలతత్వం. మా మేనమామ, స్వయాన నాకు మామయ్య బండ్లమూడి వెంకయ్య గారికి మూడు సంవత్సరాల క్రితం లంగ్ క్యాన్సర్ వచ్చినప్పుడు అటు నిమ్స్, ఇటు యేషియన్ హాస్పిటల్స్ చుట్టూ ఎన్ని వేల ప్రదక్షిణాలు చేసామో మాకే తెలుసు. రాత్రి రెండు గంటలకు టైమ్ ఇచ్చిన నాగేశ్వర్‌రెడ్డి గారు వచ్చి స్టంట్ వేయడం, దానికి మెంటల్‌గా మామయ్యను ప్రిపేర్ చేయడం.. ఆకలి లేక నిద్రపట్టక తాను సతమతమవడం అలా ఓ నెల జరిగిందంతే. తాతయ్య అంటూ నర్సులు చేసిన సేవలు, అప్యాయతల్ని పంచి ఆదరణ చూపిన డాక్టర్లను ఎప్పుడు మరచిపోలేము. మనస్సుకి కష్టం వస్తే గుండెల్నిండా చెమ్మతో దేవుడు ముందుకెళ్ళి దండం పెడతాం. దేహానికి ఏ బాధ కలిగిన చెమ్మగిల్లిన కళ్ళతో డాక్టర్‌కి దండం పెడతాం. ఎంత నమ్మకమో కదా మనకి..

మా నానమ్మ నారాయణమ్మ లేకుండా నా జీవనయానం లేదు. బోన్ టిబితో ఇరవై యేళ్ళు బ్రతికిన ధీర వనిత తాను – ఎన్ని బాధలున్నా "దేవుడా! నన్ను తీసుకుపో" అని ఏనాడూ అంటుండటం మేం వినలేదు.

నిజంగా నేను చూశాను...
జీవితం గాలి బుడగ
ఫట్‌మని పగులుతున్నప్పుడు
మెలితిప్పే నొప్పిని
పంటి బిగువున భరిస్తూ కూడా
పెదాల మీద చిరునవ్వు చెదరకుండా

కడసారి వీడ్కోలు పలుకుతూ
తన వాళ్ళను బ్రతికించుకునే
నానమ్మ లాంటి క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్ని
నేను చూశాను
నయం చేసుకోగల్గిన స్థాయిలో
వ్యాధి వున్నా
అనుక్షణం భయంతో చస్తూ
తన వాళ్ళకు నరకం చూపించే
బ్రతికి చచ్చే పిరికి వాళ్ళను

నిజంగా నేను చూశాను –
పోరాడి పోరాడి విజయంతో
తిరిగొచ్చిన అజేయుల్ని

అలుపు లేకుండా అజేయంగా
ఏ గెలుపైనా తలుపుతడ్తుందా?
ఆశ ఆయువును పెంచే అమృతం కాదా –
అంతిమ విజయం మనదేనన్న నమ్మకంతో బ్రతకలేమా?

చితి చచ్చినాక కాలుస్తుంది – చింత బ్రతికున్న వాళ్ళనూ కాలుస్తుంది. విజేతలైనా – విజితులైనా పోరాడాల్సిందే. పోరాడితే పోయేదేం వుండదు – మహా అయితే ఎటూ పోతుందనుకున్న బక్క ప్రాణం ఒక్కటే – కానీ పోరాడితే మనమేకాదు – మనతో మన కుటుంబం... ఈ అందమైన ప్రపంచం కూడా వుంటుంది.

క్యాన్సర్‌తో ఊరుకాని ఊర్లో – ఎవ్వరూ లేక కునారిల్లే వారు లక్షల మంది మనచుట్టూ వున్నారు. పలకరింతకు నోచుకోని వ్యధాతప్త జీవులు కొందరు.... ఎవరన్నా వున్నా ఎందుకు ఇబ్బంది పెట్టటమని దూరంగా కాలాన్ని లాక్కెళ్ళే జీవులు ఇంకొందరు. వర్షంలో తడుస్తూ – చలిలో కాగుతూ... ఎండకు మండుతూ – నెలల తరబడి చంటి బిడ్డలతో, వయసుడిగిన వాళ్ళతో గబ్బిలాల్లా వేలాడే తోటి మనుష్యుల్ని రోజుల తరబడి చూస్తూనే వున్నాం. పెరుగుతున్న కణాలతో గదుల్లో వ్యాధిగ్రస్తుల పోరాటాలు, బయట ఫుట్‌పాత్‌ల మీద నిరీక్షణతో, చస్తూ బ్రతుకుతూ ఈ నిర్భాగ్యుల వేదనలు – ఎవరినెవరు ఓదార్చుకోవాలో తెలియక, ఎక్కడ ఆ గుండె బరువు దించుకోవాలో అర్థంకాక, ఎంత నరకయాతన పడ్తారో చూసిన ప్రత్యక్ష సాక్షిని నేనే... అదంతా ఓ ప్రపంచం... కరిగించి – కదిలించి – కలవరపరిచి క్యాన్సర్ ప్రపంచం.

ఎంతోమంది వ్యాధి గ్రస్తుల్ని చూశాను. అనుభవాల్ని విన్నాను. గత 15 సంవత్సరాలుగా నేను బ్రెస్ట్ ఫైబ్రినాయిడ్స్ బాధితురాలనే – నేను హాస్పటల్‌కి వెళ్తున్న ప్రతిసారి నా వాళ్ళెంత ఆరాటంగా, భయంగా వుంటారో నాకు బాగా తెల్సు. చివరికి అర్థమయ్యింది ఒక్కటే – మన ధైర్యమే మనల్ని బ్రతికిస్తుంది. మృత్యువుతో పోరాటానికి కావల్సింది మందులు కాదు ముఖ్యంగా కావల్సింది మనోధైర్యమే.

జీవితంలో ఏదీ వట్టిగా రాదు. ఒక్క వ్యాధులు తప్ప అనే వారు ఎందరో వున్నారు. కానీ వ్యాధి మాత్రం అవగాహన లేమితోనే ఎక్కువ భయపెడ్తుంది అని నేను గట్టిగా నమ్ముతాను.

క్యాన్సర్ పట్ల కాస్త అవగాహన పెంచుకుంటే చాలు – మనకిక కలవరాలుండవు – కన్నీళ్ళ కుటుంబాలుండవు – ధైర్యంగా ముందుకు కదలగల్గితే నడవడమేమిటి ఏకంగా పరుగులే పెట్టొచ్చు.

నా జీవిత కాలంలో మరిచిపోలేని ముగ్గురు వ్యక్తుల గురించి నేనిక్కడ చెప్పాలి. నా ఆత్మ స్థైర్యానికి కారణభూతురాలైన మా నానమ్మ ఆడపిల్లకి వంటినిండా బట్టలెంత ముఖ్యమో గుండెల్నిండా ధైర్యం కూడా అంతే ముఖ్యం అనేది. ఇంకా కొద్ది నిమిషాల్లో చనిపోతానని తెలిసి అనివార్యం అనుకున్నప్పుడు మృత్యువునైనా ధైర్యంగా ఎదుర్కొవాలి అంటూ తోటి పేషంట్స్‌కి ధైర్యం చెప్తూనే పోయింది.... చనిపోయే చివరి నిమిషంలో కూడా కన్నీటి చుక్క రాలనివ్వలేదు తాను....

మరో వ్యక్తి ఇండో అమెరికన్ హాస్పిటల్‌లో నా పక్క పేషంట్ – 2 సంవత్సరాలుగా క్యాన్సర్‌తో బాధపడ్తున్నా ఇంట్లో భార్యకి కానీ, తన 5, 6 సంవత్సరాల పసిపిల్లలకి కానీ చెప్పకుండా తన కానిస్టేబుల్ మిత్రుడి సాయంతో తన కుటుంబంలోని వారికి ధైర్యంగా, ఒంటరిగా బ్రతకటం నేర్పిస్తూ నిలిచి గెలిచిన గొప్ప వ్యక్తి. చాలా అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో వున్నారు. ఏదో సినిమాలో సీన్లు ఒకదాని వెంట ఒకటి ఎలా వస్తాయో అలా ఓ కథ చెప్పినట్లుగా స్టేజ్‌ల గురించి నాతో చాలా క్యాజువల్‌గా చెప్తూ నవ్వించే వారు. ఎన్ని కబుర్లు చెప్పేవారో... మాతో పోటాపోటీగా అంత్యాక్షరి ఆడేవారు. అమ్మ పంపిన వంకాయ కూర తిని తన కళ్ళు చెమర్చటం నాకు గుర్తు – "ఇలాంటి భోజనం చేసి ఎన్ని రోజులైందో" అంటూనే వంకాయ మీదున్న పాటలు పాడటం – ఆ జోష్.... ఆ స్థైర్యం.... చూసి నా కన్పించింది. మృత్యువు ముందు మనం ఓడి పోతామేమో కాని మన ధైర్యం మన కుటుంబాల్ని విజయపు బాటలో నడిపిస్తుంది. మనం గుర్తొచ్చినప్పుడల్లా మన వాళ్ళకి మనం చావుతో పడ్డ బాధగుర్తురాకూడదు....

మనతో ఆనందకర అనుభూతులే గుర్తుండాలంటే మనోధైర్యం దానికెంతో అవసరం. అతనికే కాదు.... అతన్ని కంటికి రెప్పలా కాపాడుతూ అండగా నిలబడ్డ ఆ ఆప్తమిత్రుడికి కూడా  పాదాభివందనం చేయాలని అన్పించిన గొప్ప క్షణం అది...

మూడోవ్యక్తి పొన్నం మల్లమ్మగారు– 3 దశాబ్దాల క్రితం నీలోఫర్ ఆస్పత్రిలో కీమోథెరపీల మధ్య నలిగి పంటి బిగువన బాధలన్నీ భరించి అజేయంగా విజయంతో తిరిగొచ్చిన పెద్దమ్మ– ఆత్మీయతకి నిలువెత్తు సంతకం మా మల్లమ్మ. ఆ కాలంలో వైద్యం అందుబాటులో లేదన్నారు – గుర్తించటమే కాలాతీత దశలో జరుగుతుందన్నారు. తన విషయంలో ఆ రెండూ తప్పని తేలింది.  తన ఆత్మవిశ్వాసమే తనని బ్రతికించింది. ఓ యువరాజ్ సింగ్, లిసారే, మనీషాకోయిరాల, ఆనంద్ శంకర్‌జయంత్, మార్టిన నవ్రతిలోవా, డా॥ ఉషాలక్ష్మీ, డా॥ అనురాధ, సినీనటి గౌతమి, పామిలా యష్‌చోప్రాలకు క్యాన్సర్ సోకినా ఇప్పుడెంత ఫిట్‌నెస్‌తో ఉన్నారో మనం చూస్తూనే వున్నాం.

కాలం యేదైనా సకాలంలో క్యాన్సర్‌ని గుర్తిస్తే చాలు... గుండెల్నిండా ఆత్మనిబ్బరాన్ని పెంచుకుంటే చాలు... బ్రతకాలన్న ఆశతో భయపెట్టే మహమ్మారిని తరిమి తరిమి కొట్టిన తన అనుభవాలు ఎంతోమంది క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకి పాఠాలు. అమ్మ మల్లమ్మ ఒకటే చెప్తుంది... “నొప్పి లేకుండా.... కోత రాకుండా భూమిలో మొక్క మొలవదు... ఆలాంటిది మనిషెందుకు అనుకోడు...? కోతలేని కాత రాదని తెల్సుకోవాలి... రేపటి మీద ఆశతో క్యాన్సర్ బాధని తట్టుకుంటే కదా ఈ 30 యేళ్ళగా నేను బ్రతికింది... ఒక్కోసారి డాక్టర్‌గారే బాధపడేవారు. నా నొప్పినిచూసి... ఈ రోజు నా మనవళ్ళ ఉద్యోగాలు. మనవరాళ్ళ పెళ్ళిళ్ళు ఎంతో నిండుగా చూస్తున్నాను. ఇంటికి పెద్దదిక్కుగా అండగా నిలబడి నా కుటుంబానికి నిండుదనాన్ని అందిస్తున్నాను. నేనుండటం వల్లే కదా నా కుటుంబంలో ఆ లోటు లేదు...” అంటారు. నిజంకదా! 30 యేళ్ళ కిత్రమే వ్యాధిని జయించిన మల్లమ్మలాంటి వాళ్ళు ఎందరో స్ఫూర్తిగా సజీవంగా మనకు కన్పిస్తున్నారు.

డా॥ జగన్ గారు, డా॥ స్తంబాద్రి చంద్రశేఖర్‌గారు ఎప్పుడూ ఓ మాట చెప్పేవారు. ప్రతి మనిషిలో క్యాన్సర్ కణం వుంటుందట. పుట్టుకతోనే వున్న ఆ క్యాన్సర్ కణం మన అలవాట్లని బట్టి మన జెనెటికల్ నడతను బట్టి అభివృద్ధి చెందుతుందట. నాకు రాదు కదా అనుకోవద్దు... నా వాళ్ళకు  లేదు కదా అని సంబరపడకూడదు... ఎలా వస్తుందో...

ఎప్పుడొస్తుందో తెలియకుండా తుఫాన్‌లా వస్తుంది... కాకపోతే మనం ఎంత ముందు జాగ్రత్తగా వుండాలో తెల్సుకుని ఆ చర్యలు తీసుకుంటే సురక్షితంగా బయటపడ్తాం... ఎప్పుడో తుఫాన్ వస్తుందని భయపడి సముద్రంలో దూకి చనిపోతున్నామా? ఇదీ అంతే... ప్రతి సంవత్సరం టెస్ట్‌లు – డాక్టర్ గారి చెకప్‌లతో దాన్ని తరిమేయొచ్చు. మనవాళ్ళని బ్రతికించుకోవచ్చు...

మనకు తెలుసు –

కూరగాయల్లో పుచ్చులొస్తే అంతవరకు కత్తిరించి పారేసి వంట చేస్తుండటం. ఇదీ అంతే అనుకోగల్గితే చాలు. అలా ఆత్మస్థైర్యం పెంచుకోగల్గితే చాలు... ఏదీ మనల్ని ఓడించలేదు. ఏదీ మనని బాధించలేదు. ఆఖరికి మృత్యువు కూడా.

అప్పుడప్పుడు నాకనిపిస్తుంటుంది....

"అబ్బా... జీవితం బోర్‌గా వుంది" అనో జీవితంలో థ్రిల్ లేదనో...ఛా...ఈ బ్రతుకెందుకిచ్చావ్ దేవుడా.... అని విసుక్కునే వాళ్ళనో... అందమే శాశ్వతమని విర్రవీగే వాళ్ళను చూసినప్పుడో... ధనమదంతో ఆవాకులు చవాకులు వాగే వాళ్ళ గురించి వింటున్నప్పుడో ఒక్కసారి వాళ్ళని తీసుకెళ్ళి క్యాన్సర్ వార్డ్‌ని చూపించాలనిపిస్తుంది...

బ్రతికేందుకు వాళ్ళెంతగా పోరాటం చేస్తున్నారో....వాళ్ళను బ్రతికించుకునేందుకు కుటుంబ సభ్యులెంతగా ఆరాటపడ్తున్నారో... చూపించాలి... జీవితం అందరికి వడ్డించిన విస్తరికాదు... కానీ వున్నంతలో భగవంతుడు అందరికి మంచి జీవితాలే ఇస్తాడు (ఎందుకంటే ఏ అమ్మకీ తారతమ్యాలుండవు) కాని మనమే లేనిదాని కోసం ఏడుస్తూ ఉన్నదాన్ని పోగొట్టుకుంటుంటాం. నిజానికి మన శరీరం విలువ కోటి రూపాయలపై మాటే... ఒక కిడ్నీ పాడైపోతే తెలుస్తుంది... కిడ్నీని ఎంత పెట్టి కొనుక్కుంటామో... నాలుగు లక్షలు పెట్టినా ఒక్కోసారి దొరకదు.

డబ్బులేకపోవటమో – ఉద్యోగం రాకపోవటమో – ప్రేమించిన అమ్మాయి హ్యాండ్ ఇవ్వటమో – ప్రియుడు మొఖం చాటెయ్యటమో – పరీక్షలో ఫెయిలవ్వటమో, అప్పులు ఎక్కువవ్వటమో – పంట నాశనమవ్వటమో ఇవి కావు విషాదాలు... అనారోగ్యం పాలు కావటమే... ఆరోగ్యాన్ని పదిల పర్చుకోలేకపోవటమే నిజమైన విషాదం...

ఇది మాత్రం 75% మన స్వయంకృతాపరాధమే...

తల్లిదండ్రులుగా మనం పిల్లలకి ఆస్తులివ్వాలనుకుంటాం... అంతస్థు చూపించాలనుకుంటాం. కానీ సునామీ వస్తే కొట్టుకుపోయే ఆస్తులు... కాలం కల్సిరాకపోతే కరిగిపోయే అంతస్థులు ఎప్పుడూ మనతో వుండవు... మనం మన పిల్లలకి ఇవ్వగలిగేది... శాశ్వత ఆనందాన్ని అందించేది ఆరోగ్యమొక్కటే... మన ఆరోగ్యపు అలవాట్లు మనలో చక్కటి 'జనిటికల్' వాల్యూస్‌ని పెంచుతాయి. బిపి, షుగర్, థైరాయిడ్ లాంటి వ్యాధుల్ని రాకుండా చూస్తాయి... మన పిల్లలే కాదు... వాళ్ళ, వాళ్ళ పిల్లలు... ఇలా వంశవృక్షం ఆరోగ్యంగా వుంటుంది. కేవలం మన మంచి ఆహారపు అలవాట్లు – ఆరోగ్య ఆలోచనల వల్ల అంటే మీరు నమ్మాలి, నమ్మితీరాలి.

మనం పోయినా మన కుటుంబానికి ఆర్థిక అండగా వుండాలని LIC లు కడ్తాం... కానీ LIC ప్రీమియంలు కట్టటంలో చూపించే శ్రద్ధ, మన కారు కి చేయించాల్సిన సర్వీసింగ్ పట్ల చూపించే జ్ఞాపకం శరీరానికి చేయించాల్సిన టెస్ట్‌ల పట్ల చూపించం. అదీ 'పిటీ' అంటే. ఎక్కడో చదివిన జ్ఞాపకం. మనుష్యుల్ని ప్రేమించాలి, వస్తువుల్ని వాడుకోవాలి. కానీ ఇప్పుడు – మనుష్యుల్ని వాడుకుంటున్నాము. వస్తువుల్ని ప్రేమిస్తున్నాము. అందుకే ప్రేమ రాహిత్యంలో కోరి బాధలు తెచ్చుకుంటున్నాము. సమూహంలో ఒంటరిగా మిగిలిపోతున్నాము.

ప్రతి స్త్రీ పాప్‌స్మియర్ టెస్ట్, మమోగ్రాంలు చేయించుకోవాలని... థైరాయిడ్ టెస్ట్‌లు చేయించాలని... హిమోగ్లోబిన్ లెవల్స్ సరిచూసుకోవాలని ఎందరికి తెల్సు...? మాస్ ఇండెక్స్‌లు, లిపిడ్ ప్రొఫైల్స్, CBP లు రెగ్యులర్‌గా చూసుకునే జనాలు మనలో ఎందరున్నారు...?

చేతులు కాలినాక పట్టుకునే ఆకులవల్ల ఉపయోగం వుండదు... ముందే మనం జాగ్రత్తపడాలి... దేవుడు మనకిచ్చిన అత్యంత అపురూపవరం ఈ జీవితం...

జీవితాన్ని సార్థకం చేసుకోవాలంటే మనకి ఆరోగ్యం అత్యావశ్యకం. బ్రతుకు విలువ తెలియాలంటే అప్పుడప్పుడు క్యాన్సర్ హస్పటల్స్‌కి వెళ్ళండి...చూడండి... వారితో మాట్లాడండి...

బాధితుల కోసం నిండు మనసుతో ప్రార్థిద్దాం

ఆతిథ్యం ఇవ్వడానికి మన ఇంటిని చూపిద్దాం.

బాధను దించుకోవటానికి, ఓదార్చటానికి మన భుజాలు ఖాళీగానే వున్నాయని చెప్దాం...

రండి క్యాన్సర్ పట్ల అవగాహన పెంచుకుందాం

ఆత్మస్థైర్యం పంచుదాం. క్యాన్సర్ వ్యాధిని ఈ లోకం నుండే వెలివేద్దాం. ధీమాగా, సరికొత్తగా బ్రతకడం నేర్పిద్దాం.

★★★

నన్నెప్పుడూ తమ ఇంటి 'ఆడపడుచు'గా భావిస్తూ శుభాశీస్సులు రాసినందుకు, ఆత్మీయతను పంచుతున్నందుకు వదినమ్మ శోభ పార్థసారథిగారికి ఆత్మీయ వందనాలు. ఈ పుస్తకానికి ముందు మాట రాసి కవర్ పేజి బొమ్మ లేసిన "నడిచే గూగుల్" మామిడి హరికృష్ణ గారికి, ఆత్మీయ స్పందన తెలిపిన మిత్రులు పొన్నం రవిచంద్ర గారికి, డిటిపి మరియు కవర్ డిజైన్ చేసిన చంద్రావతి గారికి, అందంగా ముద్రించి ఇచ్చిన ఓం సాయి గ్రాఫిక్స్‌కి ప్రత్యేక ధన్యవాదాలు....

మీ



అయినంపూడి శ్రీలక్ష్మి

# నివాళి



కన్నీటి చుక్క రాల్చకుండా క్యాన్సర్‌తో చివరి కంటా పోరాడిన
మా నానమ్మ నారాయణమ్మకి
103 యేళ్ళు బ్రతికి గత సంవత్సరం నానమ్మను చేరిన తాతయ్య
జనార్ధనరావుగారికి ముకుళిత హస్తాలతో....

Monologue of a

# బ్రాండెడ్ హార్ట్

## ప్రోలోగ్.....

ఇప్పటి దాకా మనం
యూనివర్స్ – కాస్మోస్ గురించే
మాట్లాడుకున్నాం
ఇప్పుడు –
ఫోకస్‌ని రివర్స్ చేసి
సూక్ష్మం చూపిస్తున్న
సంవేదన గురించి
సంభాషణ మొదలెడదాం

ఇప్పటిదాకా మనం
ఎక్సోడస్‌నే సెలబ్రేట్
చేసుకున్నాం
ఇప్పుడు–
తొలి అడుగు రూట్స్‌ని
అన్వేషిద్దాం
ఇప్పటిదాకా మనం
దేహం గురించి
చర్చోపచర్చలు చేసాం
ఇప్పుడు–
దాని ఆదిమ
కణం గురించి డిసెక్షన్ చేద్దాం
ఇప్పటి దాకా మనం
కణాల బయాప్సీనే చూసాం
నేస్తమా–
అది అనుభూతుల
అటాప్సీ అని తేల్చి పారేద్దాం

**ఇంట్రో**

సునామీ తెల్సు
భూకంపం తెల్సు
గ్రహ శకలాలు తెల్సు
అణు విస్ఫోటనం తెల్సు
కానీ–
కణ విస్ఫోటనం మాత్రం
కొత్తదే కదా!

నువ్వు–నేను
మనందరం
కణాల–త్రిగుణాల
బహుబుణాల
వెలుగులమే అని తెలుసు
కానీ–
ఒక్క కణం
సముద్రమంత మనిషి గుండెల్లో
ఎంత సునామీ సృష్టించింది ?
ఒక్క కణం
మనసు రిక్టర్ స్కేల్‌ని
ఎంత ఛిద్రం చేసింది

మహా సంక్షోభానికి
మహా విపత్తే అక్కర్లేదు
ఒక్క కణం కన్నెర్ర చాలు
భూగోళమంత ఎగోనీకి
మహాసాగరమే అక్కర్లేదు
రెప్పదాటిన ఒక్క కన్నీటి చుక్కచాలు

## స్టేజ్ 1

మా ఇంటికి అనధికారిక కోడి కూతని నేను
నేను మంచంపైనుంచి లేచినపుడే
మా ఇంటికి వేకువ వస్తుంది
నా కాఫీ కప్పు పొగలతోనే
ఇంట్లోకి సూర్య కిరణాలు అతిధుల్లా వస్తాయి.

కిచెన్‌లోని నా ప్రెజర్ కుక్కర్ విజిల్స్‌లోంచే
అందరిచేతుల్లోకి టూత్ బ్రష్‌లు వచ్చి వాలతాయ్
నా వేలికొసల విన్యాసాలలోంచే
అత్తగారికళ్ళ పైకి అద్దాల జోడు
ఎక్కికూర్చుంటుంది.
మామగారి బాసింపట్టు చేతుల్లోకి
న్యూస్ పేపర్ చిక్కుతుంది

ఆయనగారి గడ్డంపైకి
షేవింగ్ క్రీమ్ నురగలు కక్కిపొంగుతాయి
పాప నుదుటి బొట్టు ఫ్లోరసెంట్ లైట్‌లా మెరుస్తుంది

బాబు స్కూల్ బ్యాగ్‌లో ఓమూల
కంపాస్ బాక్స్ ఒదిగి సర్దుకుంటుంది
పనమ్మాయి చీపురుకట్టకి
దిక్సూచి దొరుకుతుంది
దేవుడి గదిలో
గంటల సవ్వడి – దీపపు కాంతి పర్చుకుంటుంది
కిచెన్ రూమ్‌లో
అంట్ల గిన్నెలు అభ్యంగన స్నానమాచరిస్తాయి.

మొత్తంగా –
ఇంట్లోని వాల్‌క్లాక్
టిక్ టిక్ తాళానికి
నా అడుగులే శ్రుతి
అందరి డిమాండ్ల మ్యూజిక్‌కి
నా సేవలే రిథం

అలసిన నా దేహానికి
రీఛార్జ్ కదా బాత్రూం
ముఖంపై -
నీటి చుక్క స్పర్శే కదా
పునరుజ్జీవం

సబ్బు నురగల పరుగు మధ్య
ఎదపై ఉండలు కట్టిన కండరం
దేహ రహదారిపై
స్పీడ్ బ్రేకర్ అవుతుంది
అర్ధరాత్రి ఆయన వీరావేశం వల్లో-
పాలు తాగుతూ చంటిది
కొరికినందుకో-
వంట గదిలో అటక మీదున్న
పప్పుల డబ్బాని దించినందుకో
టైెంకి ఆఫీసుకి చేరుకోవాలని
సిటి బస్సులోకి చివ్వున ఎగిసినందుకో
కండరం పట్టేసి ఘన స్పర్శ అయిందని సరిపెట్టుకుంటాను
కానీ-
మేఘాల కలబోతగా ఉండాల్సిన
ఎద ఎత్తుల మెత్తదనం
ఘనీభవించిన శిలాజమై కలవరపెడుతుంది
రాత్రిగదిలో
ఆయన చేయ్యేసినపుడు
నొప్పి వెల్లువలా తన్నుకొచ్చి
గొంతులోనే సమాధి అవుతుంది.

అనివార్యంగా నేను
డాక్టర్ చేతుల్లోకి
నా గుండెలని పెట్టాల్సివస్తుంది.
ఆయన–నా పిల్లలు కాకుండా
మరో మనిషికి
నా అంతరంగ తరంగాలని
అందించాల్సివస్తుంది

మొదట్లోని సిగ్గు కాస్తా
తర్వాత బిడియమై
ఆ తర్వాత భయంగా మెటమార్ఫసిస్ చెందుతుంది

తెలీని సందేహం నుండి పుట్టిన దిగులుతో
ఉద్విగ్నవిహ్వలనౌతాను.

అప్పుడు నేను
ఓ నిండైన ప్రిస్క్రిప్షన్ ఫైల్ నవుతాను
వేర్వేరు టెస్టుల లాబరేటరీనవుతాను

## స్టేజ్ 2

మా అమ్మకి 60 యేళ్ళు
చక్కగా ఉంది
బామ్మ ఇప్పటికీ
చురుగ్గా తిరుగుతుంది
వాళ్ళ జీన్స్‌ని
పంచుకుని పుట్టిన దాన్ని కదా!
"హా.... నాకేమవుతుందిలే" అనుకుంటాను

చంటిదానికి జ్వరమొస్తే
బుజ్జిగాడికి జలుబొస్తే
ఆయనకి కాలు బెణికితే
అత్తామామలకి దగ్గొస్తే
తల్లడిల్లి పోతాను. తండ్లాటపడతాను
హాస్పిటల్‌కి పరుగెత్తిస్తాను
మందులు నేనై వాళ్ళ ఒంట్లోకి ప్రవహిస్తాను.
అందరికీ నేనే
కాళ్ళూ చేతులుగా మారతాను
వారి అనారోగ్యాలన్నీ నాకొచ్చేసి
అందరూ హాయిగా ఉండాలని ప్రార్థిస్తాను

నాకేమైనా నేను మాత్రం
జండూబామ్‌తో సరిపెట్టుకుంటాను
రేపు చూద్దాంలే.... అనే
వాయిదామంత్రాన్ని జపించి
తులసి ఆకుని నోట్లో పడేస్తాను.

ఎవరికోసమైనా
విరామం లేకుండా పరుగెత్తే నా కాళ్ళు
పనిచేసే నా చేతులు
నా కోసం అనే సరికి శిలావతారం ఎత్తుతాయి.
కానీ ఇపుడు
గత్యంతరం లేని స్థితి వచ్చింది
జీవితాన్ని అందరికోసం
ముక్కలుగా విభజించుకున్న దాన్ని కదా

ఓ ముక్కని బయాప్సీ చేద్దామంటే
మనకేం అవుతుంది?
I'm Rock Steady అనుకుంటాను.
"లైట్ లేలో యార్" అని
టెస్ట్‌లకి రెడీ అవుతాను

అత్తమామలు – ఆడపడుచు
పతి దేవుడు – పక్కింటి పిల్లలు
ఆఫీసు బాస్ – కిరాణం షాప్ కిష్టయ్య
అందరి విషయంలో నేను
థింక్ పాజిటివ్ –బి పాజిటివ్
ఆఖరికి బ్లడ్ గ్రూప్‌లో కూడా
నేను బీ–పాజిటివ్
ఈ ఒక్క టెస్ట్ రిపోర్ట్ విషయంలో
నెగెటివ్ రావాలని
ముక్కోటి దేవతల్ని వేడుకుంటాను

నిలువెల్లా పవర్ ఆఫ్ పాజిటివ్ థింకింగ్
ఇంకిపోయింది కదా–
రిపోర్ట్ లో కూడా పాజిటివే – వస్తుంది
పాజిటివ్ – పాజిటివ్
మాలిగ్నేన్సీ పాజిటివ్

## స్టేజ్ 3

రిపోర్ట్‌లన్నింట్లో తలదూర్చిన డాక్టర్
శాంతి వచనాల మధ్య
ఆటంబాంబ్‌ని పేలుస్తుంది

హిరోషిమా – ట్విన్ టవర్స్
లాతూర్ – కోటోపాక్సీ
రీటా – కత్రీనా – నీలం
ఎల్‌నినో – లానినాలన్నీ
ఒక్కసారిగా నాలోనే పొడసూపుతాయి.
సర్వేంద్రియాలూ ఫ్రీజ్ అవుతాయి
సిక్త్స్ సెన్స్ కూడా సెన్స్‌లెస్‌గా మారుతుంది

కళ్ళ ముందున్న రంగులకల
ముక్కలవుతుంది
కన్నీళ్ళ మధ్య రేపటి దృశ్యం
మసక బారిపోతుంది

ఇంట్లోని అందరూ గుర్తొచ్చి
వాళ్ళందరూ ఏమైపోతారో అనే బెంగ
వెక్కివెక్కి ఏడ్చిన నిట్టూర్పుల ఘోష అవుతుంది.

నేనిపుడు ఒక్కరితో కాదు
ఇద్దరితో కాపురం చేస్తున్నాననే సత్యం
నెమ్మదిగా 'అర్థం' అవుతుంది
ఆయన ఒకరు
నా గుండెలపైని రాచపుండు మరొకరు.

## ఇన్ ది వార్డ్

క్యాన్సర్ ఆసుపత్రి
కారిడార్లలో ప్రయాణం

సందేహం కుంచెను
భయం కలర్స్‌లో ముంచి
భవిష్యత్ క్యాన్వాస్‌పై చిలికించిన
అబ్సర్డ్ చూపులే అంతటా....
ముందే కూసిన క్యాన్సర్ కోయిల పిలుపులకి
తొందరగా వచ్చిన మృత్యు వసంత చిగుళ్ళే అంతటా...
ముందస్తు మరణాలు, అకాల వృద్ధాప్యాలే
అక్కడి గోడలపై వేలాడుతున్న
అదృశ్య పెయింటింగ్స్

అక్కడ–
వర్షించే ప్రతికన్ను
పొడి చేతి ఆనకట్ట కోసం
ఎదురుచూస్తుంది

అక్కడ–
కూలిపోయిన ప్రతి మనసు
ఆసరానిచ్చే భుజం కోసం
ఆరాట పడుతుంది

ఛిద్రమైన ప్రతి చెక్కిలీ
ఊరటనిచ్చే స్పర్శకోసం
తహతహలాడుతుంది.

చిన్నాభిన్నమైన ప్రతిపెదవీ
చిరునవ్వు దీపంకోసం
వెతుకులాడుతుంది.

అశృబద్ధమైన ప్రతి చెవీ
'you are ok' మాట కోసం
ఒళ్ళంతా చెవులను చేసుకుంటుంది.

అక్కడ–
గడ్డ కట్టిన ప్రతి హృదయం
నీకేం కాదన్న భరోసా వాక్యం కోసం నిరీక్షిస్తుంది

ఎటు చూసినా
కొంగుచాటు చంద్రుళ్ళు చేసే
అలజడులు
డాల్బీ సిస్టంలో
నిశ్శబ్దంగా శబ్దిస్తుంటాయి...

## ఫ్లాష్ బ్యాక్

చిన్నప్పుడు
'చందమామరావే' అనే అమ్మపాటతో
ఆమ్ తింటూ
చంద్రుణ్ని ఆశ్చర్యంగా చూసేదాన్ని
ఎప్పటికైనా ఆ చంద్రుణ్ని
నా గుండెలకి హత్తుకోవాలని కలలుకనేదాన్ని
సంకల్పం బలంగా ఉంటే
సాధన సుళువవుతుందట
నా సంకల్పం ధృఢమైందనుకుంటా
పన్నెండవ యేటనే మొలిచాయి
నా గుండెలపై నిండు చంద్రుళ్ళు

ఆ రెండు చంద్రుళ్ళు
నా 8వ తరగతిలో తొలిసారిగా
నేను స్త్రీనన్న
అస్థిత్వాన్ని గుర్తుచేసిన
ఆత్మ గౌరవ ప్రతీకలు
అప్పటి వరకూ ఉన్న నా నడకతీరుని
మార్చిన గురువులు
నిటారుగా నిలిచి, నడచి, పరుగెత్తే దేహం
లోపలికి కుంచించుకుపోయేలా చేసిన బరువులు

పదోతరగతికొచ్చాక
నా పుస్తకాలకు మరో ప్రయోజనాన్ని కూడా
ఆపాదించిన పూర్ణ కలశాలు
నాలోని పున్నమి వెలుగులను ఎవరికంటాపడకుండా
దాచేసేందుకు కూడా పుస్తకాలు ఉపయోగపడ్తాయని
కొత్త అర్థాన్నిచ్చిన ఆకాశదూతలు

ఇంటర్లో–
క్లాస్‌మేట్స్ అందరిలో
నాకు స్పెషల్ సిగ్నిఫికెన్స్‌తెచ్చిన
హృదయ సౌందర్య బింబాలు
పెళ్ళి చూపుల్లో
మా ఆయన్ని
కనికట్టు చేసిన ఇంద్రజాలాలు
పెళ్ళివేడుకలో
ముత్తయిదువుల చేత
లక్ష్మీదేవికి 'క్లోన్' అని పొగిడించిన నిండురూపాలు

శోభనం రాత్రి ఆయనకు అమరత్వాన్ని ప్రసాదించిన
అమృత భాండాలు
మా నుండి వచ్చిన పిల్లలకి
జీవాన్ని ధారగాపోసిన
పాలవెల్లులు

జీవితాన్ని అందించిన
మురిపాల జల్లులు
ఏ అపరాత్రో
ఉలిక్కిపడి నిద్రలేచిన నా పిల్లలకి
ధైర్యాన్నిచ్చే నిండు భరోసాలు

నీకు తెలుసో లేదో
మగాళ్ళలో ఒక్క కర్ణుడు మాత్రమే
సహజ కవచ కుండలాలతో పుట్టాడట
కానీ స్త్రీలందరూ
కర్ణులు అయింది వీటివల్లే కదా!

నాకు అర్థమైన కాలం నుండి గమనిస్తున్నా
నా వాళ్ళనుకున్న వాళ్ళందరూ
నన్నంటి పెట్టుకుని ఉన్నకాలం
బహు లిప్తనే...
నాకు పాలు ఇచ్చేప్పుడు
లాలపోసేప్పుడు–
జడవేసేటప్పుడు
అమ్మ అంటిపెట్టుకుని ఉండేది

పెళ్ళయ్యాక
మా ఆయన కూడా
నన్ను అంటిపెట్టుకుని ఉన్నరోజులు
కొద్ది మాత్రమే-
నా బంగారు పిల్లలు
బడికి వెళ్ళేంతగా ఎదిగిన
ఈ పదేళ్ళ కాలంలో కూడా
తోడుగా నన్ను అల్లుకున్న సమయం గంటలు మాత్రమే

కానీ-
నలభై యేళ్ళుగా
నన్ను అనవరతం ఆజన్మం అంటిపెట్టుకుని
నాతో సహజీవించి
నా ప్రతీ కదలికలో నాతో సహచరిస్తున్నది మాత్రం
అవే కదా!

నా మంగళ సూత్రాన్ని
ఎంతో అపురూపంగా
పొదివి పట్టుకునే
ఆత్మీయ నేస్తాలు కదా

నేను ఏడ్చినప్పుడు
నాతో పాటు వెక్కెక్కిపడేవి
నేను హాయిగా నవ్వినప్పుడు
నిండుగా కదిలేవి
నేను కోపగించుకున్నప్పుడు
నాతోపాటు ఉద్రేకపడేవి

నేను ఆందోళన చెందినప్పుడు
ఉద్విగ్నమయ్యేవి
నేను ఆనందంతో సిగ్గుల మొగ్గ అయినప్పుడు
మంకెన పువ్వులుగా ఎఱ్ఱ బడేవి

నా ప్రతి అనుభూతిని–అనుభవాన్ని
సానుభూతితో–సహానుభూతితో
రెసిప్రొకేట్ చేసిన
నా జీవన నేస్తాలు కదా

నాలో నాకు – నాతో నాకు
నిండైన నిబ్బరాన్నిచ్చిన తోడులు
స్థైర్యపు జాడలు కదా....

నా గుండె వైకుంఠానికి
ఇరువైపులా–
రక్షణగా నిలుచున్న
జయ విజయులు కదా....!

## ఫ్లాష్ ప్రెజెంట్

ఎడతెరిపి లేకుండా
ఎన్నెన్నో థెరపీలు
కీమో థెరఫీ
రేడియో థెరపీ
మేలినో థెరపీ

వీల్‌చైర్....
నా విల్ పవర్‌ని
ఎద్దేవా చేసింది
గ్రీన్ డ్రెస్ నా అడ్రస్‌ని మార్చేసింది
ఎక్కే సెలైన్‌లు
గుచ్చే ఇంజక్షన్‌లు
కారే నా కన్నీటిని
భర్తీ చేయలేకపోయాయి.

మానవుడు
జంతువు నుంచి పరిణామం చెందాడట
ఈ టెస్టుల పుణ్యమా అని
ఈ ల్యాబ్‌లో నేను
పుణ్య పత్ని నుండి గినియా పిగ్‌గా
రివర్స్‌లో మారిపోయాను
"క్యురియస్ కేస్ ఆఫ్ బెంజిమిన్ బటన్"లాగా.....

మాయలపకీరు ప్రాణం
ఏడేడు సముద్రాల ఆవల దీవిలోని
చిలకలో ఉందంటే
చిన్నప్పుడు కోటి ఆశ్చర్యదీపాలు వెలిగేవి
ఇప్పుడు చెట్టంత నా ప్రాణం
నా కంటికే కనిపించనంత
సూక్ష్మ కణంలో నిక్షిప్తమై ఉందంటే,
ఈ డయాగ్నసిస్ పుణ్యమా అని
నాలోని అల్పత్వం అవగతం అయింది.

అడిగితే కాని అమ్మయినా పెట్టదంటారు.
క్యాన్సర్ - అమ్మలగన్నయమ్మ
నేనేది అడగకుండానే
తన కణాలను
నాలో పుట్టలు పుట్టలుగా పెంచింది.

అల్ట్రా మోడ్రన్ ఎక్విప్‌మెంట్
చేస్తున్న ట్రీట్‌మెంట్స్ కన్నా
నా గుండెలపై పెరుగుతున్న
కణాల వేగం ఎక్కువట

చివరాఖరికి
తెల్ల యాప్రాన్‌లు ధరించిన
దేవదూతలందరూ
ఒక్క నిర్ణయానికి వచ్చారు
యూనిఫాం లో సైతం
ఒక్క లాగా ఉండని వీరందరూ
నా కేస్ విషయంలో మాత్రం
ఒక్కటై చేతులు ఎత్తేశారు

## ఇన్ ద థియేటర్

థియేటర్ ఆర్ట్స్ అంటే
నాకెంతో ఇష్టం
థియేటర్ అనగానే రవీంద్రభారతో
సారస్వత పరిషత్తులో సురభినాటకమో
క్రాస్ రోడ్స్‌లోని దేవి థియేటరో గుర్తుకొచ్చి

మూడు గంటల కొత్త బంగారులోకం
స్ఫురణ కొస్తుంది

కానీ–
ఇప్పుడు థియేటర్‌కి
కొత్త అర్థం ఏర్పడింది

సర్జికల్ బెడ్–ఫోకస్‌డ్ లైట్స్
గ్రీన్ కర్టెన్స్–చేతులకి గ్లోవ్స్
స్వైన్ ఫ్లూ మాస్క్‌లు
తలపై క్యాప్‌లను బోర్లించుకుని
కళ్ళు మాత్రమే చూపించే దేవదూతలు

కత్తులు – సూదులు – మెడికేటెడ్ దారాలు
ఇది కూడా థియేటరే
ఆపరేషన్ థియేటర్...

ఈ థియేటర్ ఓ బోధివృక్షం
దేహాత్మల ద్వంద్వ తాత్వికతని
నాకు జ్ఞానోదయం చేసింది.
నా దేహంపై కోతల చప్పుడు వినిపిస్తున్నా
ఆ సౌండ్‌ని సెన్స్ చేయలేను.

ఈ థియేటర్‌లో
నేనే కథానాయికని
ఈ ఏకాంకికలో
అన్ని పాత్రలు నావే –
పాత్రలలో నిండిన గాయాల స్పెసిమెన్సూ నావే

జనరల్ ఎనస్తీషియా ట్రాన్స్‌లో
నా ఉటోపియాని
నా నుంచి దూరం చేసే
అనివార్య పన్నాగం సక్సెస్ అయ్యింది
మూతలు పడుతున్న నా కంటి పాపలకి
నా నిండు చంద్రుళ్ళు
నా జయవిజయులు
స్టీల్ ప్లేట్‌లో
రక్తపు ముద్దలుగా
లీ....ఈ....ఈ....ఈ....ఈ....లగా
గుండెపెరికి వేసిన గ్లాడియేటర్‌లా
నాలో నేను జా....ఆ....ఆ....ఆ....ఆ....లిగా

భూమి గుండ్రంగా ఉందని
నా గుండెలపై చెయ్యేసుకుని
ధైర్యంగా చెప్పేదాన్ని
ఇప్పుడు–
బల్లపరుపుగా ఉందని
చెప్పాలేమో......

## పింక్ హోప్

నా చిన్నప్పుడు
మా వీధి మొత్తం మీద
రెండు జడల అమ్మాయిని నేనే
అమ్మతో గొడవపడి
అల్లరి చేసి, అరచీ
రెండు జడలు వేయించుకునేదాన్ని

రిబ్బన్–
నా వెంట్రుకల పాయలని
ఒక్కటిగా అల్లేది
స్టెప్పులుగా కలసిపోయి
నా కురులకు కొనసాగింపు అయ్యేది

అమ్మెప్పుడూ
పచ్చ రిబ్బన్లే అల్లేది
నాకేమో
లేలేతగా కన్పించే
గులాబీ రిబ్బన్ బాగా నచ్చేది

అప్పుడు–
అంతగా ఆశపడినందుకేనేమో
ఇప్పుడు–
పింక్ రిబ్బన్
నా కొత్త
సహచరి అయ్యింది

పింక్ రిబ్బన్
నా బ్రతుకు పతాక అయ్యింది
కొత్త జన్మపు
జీవ శ్వాస అయ్యింది

గుండెలకి రక్షణ లేకపోవటమంటే
కొత్త ధైర్యం రావటమని
అర్థం అయ్యింది

చంద్రుళ్ళను కోల్పోవటమంటే
నిశీధి చీకటి కాదని
కొత్త సూర్యోదయమని తెలిసొచ్చింది

అందుకే
పింక్ రిబ్బన్‌తో
నాలాంటి కోట్లాది స్త్రీల గుండెల్లో
జీవనేచ్ఛను నింపటానికి
నేను కదం తొక్కాను

కొత్త బతుకును జీవించటానికి
నేను–
ఆశాగీతం పాడుతున్నాను

ఇంతకాలం ఆడపిల్లని
వేరేవరి గుండెల పైన్నో కుంపటి అన్నారు
ఆడపిల్ల గుండెల్లోనే కుంపట్లు వున్నాయని
ఇప్పుడు ప్రకటించాలి
ఆ కుంపట్లను చల్లార్చడానికి
ఆత్మస్థైర్యపు నీటి రిజర్వాయర్లను కూడా నిర్మించాలి.

నా ప్రియ స్నేహితా!
ఆప్తజీవనీ–
గాయాలు–బాధలు
దుఃఖాలు–వేదనలూ,
ఖండనలూ, దండనలూ
మనకు కొత్తకాదు కదా!

అనాదిగా ప్రతిగాయం మనల్ని
మరింత పదును తేల్చింది కదా!
ప్రతి విషాదం మనలో
ఇంకొంత విశ్వాసాన్ని
పాదుకొల్పింది కదా
ప్రతి భూకంపం–
మనలో మళ్ళీ గూడు నిర్మించుకునే
స్థైర్యాన్ని నింపింది కదా!
ఇదీ అంతే–

నా సహచరీ,
ఆకులు రాలడమంటే
వసంతం ఆగిపోవడం కాదుకదా
కొమ్మలు విరగడమంటే

చెట్టు నేలకూలడం కాదుకదా
మబ్బు కురవడమంటే
ఆకాశం కరగడం కాదుకదా

ఫైల్ కరప్ట్ కావడమంటే
సిస్టమ్ కొలాప్స్ అవడం కాదుకదా
పింక్ స్లిప్ అంటే జాబ్‌లోంచి
తీసేయడమేకానీ,
ఉద్యోగంలోంచి రిటైర్‌మెంట్ కాదుకదా

ట్రోజన్ హార్స్ రావడమంటే
గ్రీక్ నాగరికత అంతం కాదుకదా

అమావాస్య ఆగమనమంటే
పున్నమి చరమాంకం కాదుకదా
వక్షోజాలు రాలిపోవడమంటే
అక్షయ పాత్రలాంటి మనసు మోడువారడం కాదుకదా

అందుకే ఈ గుండె కోతని
గుండెల్లో కొత్తకాతగా మలుచుకుందాం.

ప్రసవమంటేనే కొత్తజన్మ
కనీసం రెండు సార్లయినా
పునర్ జన్మించిన వాళ్ళం
ఇపుడు మనకోసం
మరోసారి సరికొత్తగా జన్మిద్దాం
ఫీనిక్స్‌లా పునరుత్థానం పొందుదాం.

ఈ రాచపుండుని
దేహ సంస్కృతిలోని కొత్త పండుగగా ఆహ్వానిద్దాం

ఉరోజ రాహిత్యదశని
ఇన్నాళ్ళూ స్త్రీత్వం పేరిట
వేసిన సంకెళ్ళ నుండి విముక్తిగా భావిద్దాం
జీవన పుస్తకంలో
కొత్త పాఠంలా చదువుకుందాం
ఈ స్తనాతీత దిశని
మహిళా ప్రస్థానంలో
నవయుగోదయం అని చాటి చెపుదాం

ఈదురు గాలి వీచిందని
గడ్డిపువ్వు పూయకుండా ఆగదు
తుఫాను వచ్చిందని
పంటలు మొలకెత్తకుండా ఉండవు
కొమ్మలు విరిగి పోయాయని
వృక్షాలు ఏడుస్తూ కూర్చోవు
చీకట్లు ఆవరించాయని
మళ్ళీ సూర్యోదయం వెలుగులు చిందకుండా ఉండదు

నా ప్రియ సహోదరీ,
రా....
ఇప్పట్నుంచీ
'షీ'గా కాకుండా
మని'షి'గా జీవిద్దాం.....

లే....నిలబడు.....
ఇప్పట్నించీ
'జెండర్'గా కాకుండా
'జెండా'యై నడుద్దాం.....



# ఆత్మీయవాక్యం

శ్రీలక్ష్మి కవిత్వం గురించి చెప్పడానికి ముందు ఓ మాట చెప్పాలి.

వంగూరి ఫౌండేషన్ వారి అంతర్జాతీయ కవితల పోటీలో 'బర్త్‌రేప్' కవితకి తనకి ప్రథమ బహుమతి వచ్చింది. బహుమతి తీసుకోవడానికి యూఎస్ వెళ్ళాల్సి రావటంతో అమెరికా ఎంబసికి వీసా కోసం అప్లై చేసింది. అప్పటికి కొంతకాలంగా 'తానా' కోసం వెళ్ళాల్సిన కొంతమంది కళాకారులకి వీసాలు రిజెక్ట్ అవుతున్నాయి. ఆ టైమ్‌లో తాను వీసాకి వెళ్ళటంతో మా మిత్రబృందం కాస్త టెన్షన్‌పడ్డాం. ఎందుకంటే ఎంతో కాలంగా శ్రీలక్ష్మి వాళ్ళ బ్రదర్స్ అందరూ అమెరికాలో సెటిల్‌అయినా తానెప్పుడూ వెళ్ళలేదు. వాళ్ళు ఎన్నిసార్లు రమ్మంటారో కూడా మాకు తెలుసు. ఈసారి వీసా వస్తే తరుచు వెళ్ళొస్తూ వుండొచ్చుగా అన్పించింది.

అనుకున్నరోజు రానే వచ్చింది. వీసా కోసం వెళ్ళిన తాను ఇంకా రాలేదు. ఏ న్యూస్ రాలేదు – ఫ్రెండ్స్‌కి ఫోన్ చేశాం. ఎంబసి దగ్గరే ఉన్నామన్నారు. మా ఫ్రెండ్స్ వీసా రిజెక్ట్ కావటంతో వచ్చేశారు. శ్రీలక్ష్మిని ఇంటర్వ్యూ చేస్తున్నారని చెప్పారు. గంటైనా ఫోన్ రాలేదు – అప్పుడు హరి కృష్ణ ఫోన్ చేసి "అమెరికన్స్‌కి పొయెట్రీ ఎంతో ఇష్టమే కాకుండా అమిత గౌరవం. పొయెట్రీ రాస్తారని తెలిసి, ప్రైజ్ తీసుకోవడానికి అమెరికా వెళ్తుందని తెలిసి ఇంట్రెస్టింగ్‌గా మాట్లాడారట. వెంటనే స్టాంపింగ్ కూడా వేసేసారని" చెప్పారు. అదే విషయం మీద మేం ఇప్పటికీ శ్రీలక్ష్మిని ఏడిపిస్తూ ఉంటాం.. ఓ కవిత చెప్పి వీసా కొట్టేసారని.

ఇప్పుడు తలుచుకుంటే నవ్వొస్తుంది కానీ అప్పటి టెన్షన్ అప్పటిది. శ్రీలక్ష్మికి కలం బలమే కాదు, గళం పదును కూడా ఎక్కువే. ఎంత అనుభూతితో రాస్తుందో అంత ఆర్ద్రంగా కవిత్వం చెప్తుంది. అన్నిటికీ మించి తన విశ్లేషణ బాగుంటుంది. నాకు తెలిసి బాగా రాయగలిగిన ఎంతోమంది కవులు పూర్ ప్రజెంటర్స్... బాగా ప్రజెంట్ చేస్తారనుకునే కొంతమందిది పూర్ ఎక్స్‌ప్రెషన్.. కానీ శ్రీలక్ష్మి కవిత్వం చెప్తుంటే ఓ దృశ్యం అలా

మార్దవంగా కదిలిపోతున్న అనుభూతి కలుగుతుంది. (కావాలంటే లైఫ్ @ చార్మినార్ డాక్యూ పోయం వినండి) అలాంటిది కవిత్వం గురించి మాట్లాడాక వీసా ఇవ్వకుండా వుంటారా అనిపించింది.

అసలు మా అందరి ఫ్రెండ్‌షిప్ కవిత్వంతోనే మొదలయ్యింది. ఒక పదం పట్టుకుని ఆ పదం మీద ఆ నెలలో ఓ కవిత రాయాలనుకునేవాళ్ళం. మామిడి హరికృష్ణ గ్రూప్-1 ఆఫీసర్ కావడంతో లాస్ట్ మినిట్ దాకా రాయలేకపోయేవాడు. అయితే చిత్రంగా మేం కూర్చునే గంటలోపుగా అప్పటికప్పుడు రాసి ఇచ్చేసేవాడు. శ్రీలక్ష్మి మాత్రమే ఫేర్ కాపీతో వచ్చేది. నేను సగం అయ్యి, కాక రఫ్ కాపీతో వెళ్ళి శ్రీలక్ష్మితో (తన రైటింగ్ బాగుంటుందని వంక చెప్పి) ఫెయిర్ చేయించుకునేవాళ్ళం. నిజానికి ఇప్పుడు పబ్లిష్ అవుతున్న చాలా కవితలు అప్పుడు మేము పందెం పెట్టుకుని రాసుకున్నవే.

ఒకరికి ఏదయినా తెలిస్తే అందరం కలిసి చర్చిస్తాం.. మాడిశెట్టి గోపాల్, శ్రీలక్ష్మిలకు జ్ఞాపకశక్తి ఎక్కువ. మాడిశెట్టి ఎవరి పుట్టినరోజైనా బాగా గుర్తుపెట్టుకుని, ముందుగానే చెప్పి మా మతిమరుపుల్ని రక్షించినట్టు శ్రీలక్ష్మికి ఏ విషయం తెలిసినా ఎస్ఎంఎస్‌లతో అలర్ట్ చేసి రిమైండర్ పెడుతుంటుంది. కొంతమంది అనుకుంటున్నట్టుగా మా మిత్రబృందం రోజూ కలుసుకోం. రోజూ ఫోన్ చేసుకోం. ఎట్‌ఎటైమ్ మా ఫ్రెండ్‌షిప్‌ని వదులుకోం. నా పుస్తకావిష్కరణ ఉంటే నెలరోజులు అందరూ కష్టపడ్డారు. మా రచనలు ఏవైనా పబ్లిష్ అయితే పది కాపీలు కొని, అందరికీ పంచుతాం. శ్రీలక్ష్మి వాళ్ళ పాప పెళ్ళి ఉంటే అందరం కలిసి నిలబడ్డాం. జండర్‌తో కాకుండా జెన్యూన్‌గా గుర్తింపు పొందాలనుకుంటాం. అంతస్తులు, అధికారస్థాయిలు, ఈగోలు మా ఫ్రెండ్‌షిప్ మీద ఎప్పుడూ ప్రభావం చూపలేదు.

మా అమ్మ మల్లమ్మకి శ్రీలక్ష్మి అంటే చాలా ఇష్టం. తాను ఎప్పుడు కరీంనగర్ వచ్చినా ఏదో ఒకటి చేసి పెడుతుంది. మా పాప, శ్రీలక్ష్మి వాళ్ళ పాప సమ వయస్కులు. (సాయి హర్షిత, చంద్రలేఖలు) ఆ ఇద్దరికి లైఫ్ ఎట్ ఛార్మినార్ ప్రొడ్యూసర్స్‌గా కఫిసో జాతీయ అవార్డు వచ్చింది. అప్పుడు శ్రీలక్ష్మికి ధీటుగా వారిద్దరూ మాట్లాడటం మాకు గర్వంగా అనిపించిన సందర్భం కూడా.

ఇప్పుడిక ఈ మోనోలోగ్ ఆఫ్ ఎ వూండెడ్ హార్ట్ దీర్ఘ కవిత విషయానికొద్దాం. ఇది శ్రీలక్ష్మి కల. దాదాపుగా ఐదారు సంవత్సరాలుగా చెప్తుంది, ఈ సబ్జెక్ట్ మీద లాంగ్ పోయం రాయాలని. కొన్ని స్వానుభవాలు, కొన్ని సార్వజనీనాలని నేననుకుంటున్నాను. తన కలానికి ఉన్న పదునెంతో తన కన్నులు కార్చిన కన్నీటి బరువెంతో ఈ కవితలో చెప్పింది అన్పించింది – శ్రీలక్ష్మికున్న గొప్ప సుగుణం – ఏదనుకున్నా సాధించటం – మొండి పట్టుదల తనది – ఏదైనా సాకారం చేసేస్తుంది.

బ్రెస్ట్ క్యాన్సర్ వెనకున్న చేదు వాస్తవాలు ఆడవారే కాదు మనుషులందరూ గ్రహించాలంటూ అప్పుడైనా కొంతమందైనా, కొన్ని కుటుంబాలైనా ఈ మహమ్మారి బారిన పడకుండా సంతోషంగా బ్రతుకుతాయంటూ ఓ ఉదాత్త ఆశయంతో శ్రీలక్ష్మి చేసిన ఈ చిరు ప్రయత్నం తప్పకుండా సత్ఫలితమిస్తుందని మా ప్రగాఢ నమ్మకం.

చివరిగా ఒక మాట. నాగేశ్వరరావుగారు (శ్రీలక్ష్మి శ్రీవారు) ఎప్పుడూ ఒక మాట చెప్తుంటారు "కవి సమ్మేళనం ఉంది, కొత్త కవితతో రండి" అంటే శ్రీలక్ష్మి అమెరికా అయినా ఖర్చులు పెట్టుకుని వెళ్ళిమరీ కవిత చెప్పి వస్తుంది అని. అది నాగేశ్వరరావు గారు సరదాగా చెప్పినప్పటికీ శ్రీలక్ష్మికి కవిత్వం అంటే అంత ఇష్టం అని చెప్పడానికే ఈ ఉదాహరణ చెప్పాను. తన ఈ 5వ పుస్తకం తనకి మరింత పేరు ప్రఖ్యాతలు, అవార్డులు తెచ్చిపెట్టాలని మేమంతా మనసారా కోరుకుంటున్నాం.



**పొన్నం రవిచంద్ర, మంగళ**

# నమస్సుమాంజలి

గురుదేవుళ్ళు కీ॥శే॥ సైబపరంధాములు–అహల్యమ్మగారు,
డా॥ నాళేశ్వరం శంకరం–సుభద్ర గారు,
కీ॥శే॥ శోభనాథ్‌సింహ్ గారు, సమీర,
వి.పి. చందన్ రావు, సి.నర్సింగ్‌రావు గారు (దాసి),
వీరమాచినేని ప్రసాద్‌గారు, బ్నింగారు.

అడుగడుగున అండగా నిలిచే ఆకాశవాణి ఆత్మీయ సిబ్బందికి, ఆలిండియా అనౌన్సర్స్ అసోసియేషన్‌కి, డ్యూటి రూం మిత్ర బృందానికి, స్టేషన్ డైరెక్టర్ మంగళగిరి ఆదిత్య ప్రసాద్ గారికి, డా॥ పి.యస్. గోపాలకృష్ణగారికి, రాజారావుగారికి, మంత్రవాది మహేశ్వర్‌గారికి, దేవదాస్‌గారికి, రాంబాబు గారికి, A.I.R. మిత్రబృందాలకి

పిన్ని అంటూ ఆత్మీయంగా పిలిచి ఈ మధ్యనే దివంగతులైన రావూరి భరద్వాజ గారికి, యువసంతకాలతో నా వెన్నుతట్టి ప్రోత్సహించిన కీ॥శే॥ నాగభైరవ కోటేశ్వరరావుగారికి, కీ॥శే॥ పులికంటి కృష్ణారెడ్డిగారికి పాదాభివందనాలు....

మా గురువులకే గురువులైన జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ సి.నారాయణరెడ్డి గారికి, డా॥ యన్.గోపిగారికి, డా॥ ఎల్లూరి శివారెడ్డిగారికి, కేతు విశ్వనాథ్‌రెడ్డిగారికి వందనాలు...

రాజకీయ ప్రవీణులు సి. హెచ్. విద్యాసాగర్ రావు గారికి, పొన్నం ప్రభాకర్ గారికి, మధుయాష్కి గౌడ్ గారికి... జాగృతి కవితగారికి నమస్కృతులు.

అభిమానమూర్తులు శీలా వీర్రాజు గారు, కె. శివారెడ్డి గారు, జింబోగారు, ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారు, నందిని సిధారెడ్డి, పాపినేని శివశంకర్ గారు, నగ్నమునిగారు, జె. చెన్నయ్యగారు, సుధామ గారు, యాకూబ్ గారు, కంచనపల్లి, కందుకూరి శ్రీరాములు గారు, జూకంటి జగన్నాథం గారు, నందలూరి రాజశేఖర్ గారు, పైడిశ్రీ గారు, ముకుంద రామారావుగారు, డా॥ ఆయాచితం నటేశ్వర శర్మ గారు, కందాళై రాఘవాచార్యగారు, మోత్కూరి అశోక్ కుమార్ గారు, సురారం శంకరంగారు, గన్ను కృష్ణమూర్తిగారు.

ఆత్మీయ సింధువులు డా॥ ఇందుకూరి నిర్మల, ఆర్.యమ్. గోనేల I.A.S. గారికి, డా॥ కె.వి. రమణ I.A.S. గారికి, రాళ్ళబండి కవితా ప్రసాద్ I.A.S. గారికి, బుర్రా వెంకటేశం I.A.S. గారికి, వాణీమోహన్ I.A.S.

గారు, ఆనందగజపతి రాజుగారు DCP-సుబ్బలక్ష్మిగార్లకి, కె.వి. సత్యనారాయణ I.A.S. గారికి, డా॥ రవిశంకర్ అయ్యన్నార్ I.P.S. గారికి, జక్కంశెట్టి సత్యనారాయణ I.P.S. గారికి.

ఇందూర్ భారతి, హరిదా రచయితల సమాఖ్య, లేఖిని, రంజని, వంగూరి ఫౌండేషన్, అపురూప అవార్డ్స్ కమిటి, హంసిని, జి.వి.ఆర్ ఆరాధన, జ్యోత్స్న కళాపీఠం, కథిసో, ఎఫ్.డి.సి. సభ్యులందరికి... నా నంది జ్యూరీ ఫ్రెండ్స్ అందరికి...

ఆంధ్రభూమి శాస్త్రి గారు, జయంతి కొండల్‌రావు గారికి, ఆంధ్రజ్యోతి, స్కైబాబాగారు, నమస్తే తెలంగాణ కందుకూరి రమేష్‌బాబుగారు, పాలపిట్ట గుడిపాటి గారు, ప్రస్థానం వొర ప్రసాద్ గారు, మిసిమి అశ్విని కుమార్ గారు, యన్.బి.టి. పత్తిపాక మోహన్ గారు, యోజన సురేష్ గారు, బాలకృష్ణగారు, లీగల్ రిపోర్టర్ వెంకట్ నారాయణగారు, పొద్దు బైస రాందాస్‌గారు, నేటి నిజం బైస దేవదాసుగారు, భూమిక సత్యవతిగారు, వెలుగు ఆచార్యులుగారు, నెమలీక దేవిగారు, చేతన, అన్వేషి, అస్మిత, ప్రరవే మిత్ర బృందాలకి -

సాహితీ సష్టలు డా॥ వాసా ప్రభావతిగారు, ఎన్. అరుణగారు, డా॥ వాణి గారు, డి. కామేశ్వరిగారు, పోల్కంపల్లి శాంతాదేవిగారు, వాడ్రేవు వీరలక్ష్మీదేవి గారు, ఓల్గా, డా॥ సి. భవానిదేవి గారు, తెన్నేటి సుధాదేవి గారు, డా॥ శరత్ జ్యోత్స్నారాణి గారు, తమరిశ జానకి గారు, పొత్తూరి విజయలక్ష్మి గారు, శిలాలోలిత గారు, కె.బి. లక్ష్మి గారు, జగద్ధాత్రి గారు.

మిత్రులు శైలజ, సుశీల కుమారి, శైలజా మిత్ర, రూప, స్వాతి శ్రీపాద, రాజీవ, అరుణా సుబ్బారావు, రెంటాల కల్పన, దలాస్ మంజులత, విశాఖ మల్లేశ్వరి, రత్నమాల, జయవింజల, సంధ్య, కుమారి, జ్వలిత, అనిశెట్టి రజిత, జి. విజయలక్ష్మి, నాగమ్మ పూలే, కొండపల్లి నీహారిణి, పుట్ల హేమలత, రేణుకా అయోల, తాయమ్మ కరుణ, గౌరిలక్ష్మి, అత్తలూరి విజయలక్ష్మి, హిమజ, జాజుల గౌరి, డా॥ ఆర్. కమల, పి. సురేష్‌కుమార్, తొట్ల వెంకటనారాయణగారు, చీకోలు సుందరయ్యగారు, బాలగంగాధర్ తిలక్, మేకా రామస్వామి గారు, ధోనేపుడి చక్రపాణి, జి. నరసింహ స్వామి, జలంధర్, శివయ్య, ఘనపురం దేవేందర్, ఎం.వి. రామిరెడ్డి, ఎలనాగ, ఏనుగు నర్సింహారెడ్డి, కత్తి గంగాధర్, సాంబయ్య, స్ఫూర్తి, రంగు సత్యనారాయణ, సంతుకుమార్, ఎం. అశోక్‌కుమార్, జావీద్, లంకా గోవర్ధన గిరిరావు-లలిత, ఝాన్సీ-కె. రాఘవేంద్రప్రసాద్ గారు.

రేడియో ఖుషీ.కమ్ సి.ఇ.ఓ. తిరుమలరెడ్డి గారికి, సిబ్బందికి.

నా కష్టంలో వెన్నుదన్నుగా ఉండే అమ్మ సరోజిని దేవి–నాన్న శ్యామ్‌సుందర్ రావు, అత్తమ్మ హనుమాయమ్మ, విజయంలో వెన్నుదట్టి ప్రోత్సహించే అన్న శేఖర్–వదిన సుధ, మరిది రమేష్– తోటికోడలు సంధ్య, అడపడుచు రాణి–సాంబశివరావు, తమ్ముళ్ళు–మరదళ్ళు, సుబ్బారావు–బిందు, మహేశ్వర్ –మాధవి, మేనల్లుడు సమయ్, మేనకోడళ్ళు సంహిత, మహతి. నాకు మంచి మిత్రురాలైన మా వియ్యపురాలు బొద్దులూరి ఉమ, మాతో ఉన్నది కొంతకాలమే అయినా అమితమైన ఆత్మీయతను అందించిన వియ్యంకులు కీ॥శే॥ ప్రసాద్‌గారు.

నాకు, నా జీవితానికి Piller of Strength అయిన మా శ్రీవారు నాగేశ్వరరావుగారు, పెద్దమ్మాయి సాయినవ్యత–అల్లుడు బొద్దులూరి యశస్వ్, చిన్నమ్మాయి హర్షితకి ఆత్మీయంగా...

# బ్రెస్ట్ క్యాన్సర్ విశ్వరూపం

ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం–


1. విశ్వవ్యాప్తంగా ప్రతి ఏటా మరణిస్తున్న వారి సంఖ్య 12 లక్షలు, భారత్‌లో 1 లక్షా 25 వేల మంది ఏటా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. 2025వ సం॥లో ఈ సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశాలు ఉన్నాయి.
2. 30–39 ఏళ్ళ వయసున్న ప్రతీ 230 మందిలో ఒక మహిళ ఈ వ్యాధి బారిన పడుతున్నారు.
3. మనదేశంలో ప్రతి 28 మంది మహిళలలో ఒకరికి ఈ వ్యాధి సోకే అవకాశం వుంటే అమెరికాలో ప్రతి 8 మంది మహిళలలో ఒకరికి బ్రెస్ట్ క్యాన్సర్ సోకే అవకాశము ఉంది. అమెరికాలో ఈ వ్యాధి బారిన పడిన నలుగురిలో ఒకరు మరణిస్తే ఇండియాలో ఇద్దరిలో ఒకరు మరణిస్తున్నారు.
4. మనదేశంలో క్యాన్సర్ సంభవిస్తున్న మొత్తం కేసులలో అత్యధిక కేసులు బ్రెస్ట్ క్యాన్సర్‌వే....


ఈ గణాంకాలు మిమ్మల్ని భయపెట్టాలని కాదు....


వాస్తవాలు ఎరిగి కాస్తంత జాగ్రత్తపడ్తారని....


అవగాహన పెంచుకుంటారని....


# అయినంపూడి శ్రీలక్ష్మి రచనలు




సునామీ తెల్సు
భూకంపం తెల్సు
గ్రహ శకలాలు తెల్సు
అణు విస్ఫోటనం తెల్సు
కానీ
కణ విస్ఫోటనం మాత్రం కొత్తదే కదా...

★ ★ ★

అడిగితేనే కానీ
అమ్మయినా పెట్టదంటారు
క్యాన్సర్ -
అమ్మలగన్నయమ్మ
నేనేదీ అడక్కుండానే
తన కణాలను
నాలో పుట్టలు పుట్టలుగా పెంచింది

★ ★ ★

ఈ స్తనాతీత దిశని
మహిళా ప్రస్థానంలో
నవయుగోదయం అని చాటి చెపుదాం
లే.. నిలబడు
ఇప్పట్నించీ
'జెండర్' గా కాదు
'జెండా'యై నడుద్దాం...!



దేశ చరిత్రలోనే - బ్రెస్ట్ క్యాన్సర్ మీద తొలి దీర్ఘకవిత

ప్రచురణ
సరోజినీ శ్యాంసుందర్ వృద్ధాశ్రమ సేవా సంఘం
హైదరాబాద్

